ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

మంగళవారం 25 ఆగస్టు 2026 | సంపుటి: 1 | సంచిక: 69 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే

## అంతే సంగతులు

**ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం**

**ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు**



2

అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు.

**న్యూఢిల్లీ,ఆగస్ట్24 (సింగిడి)**



2

ఇరాన్‌తో ఆట

## చివరికి వచ్చింది

**యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన**

# సోషేమ్ మీడియా..

## పోస్ట్ వైరల్.. నిజం గాయబ్

**ముద్ర వేయడం ఈజీ.. తుడవడం కష్టమే.**

**స్వేచ్ఛా.. బాధ్యతా? సెల్ ఫోన్ ఉంటే ఇష్టారాజ్యమేనా..?**

**సోషల్ మీడియాదే తుది తీర్పా?**

**ఈశ్వర్ సాయి–మాధురి రాథోడ్ వ్యవహారంతో రగడ**





**మోహన్ పూసాల**

*ఒక్క మాట.. ఒక్క క్లిక్.. ఒక్క వీడియో.. ఒకరి జీవితంపై చెరగని ముద్ర వేయగలదు. సోషల్ మీడియా వేగం పెరిగేకొద్దీ.. నిజం తేలకముందే ఆరోపణలు వైరల్ అవుతున్నాయన్న ఆందోళన పెరుగుతోంది. పోస్టులు, వీడియోలు, కామెంట్లు క్షణాల్లో వేల మందికి చేరుతున్నాయి.. కానీ వాటి వెనుక వాస్తవం ఏంటన్నది తెలుసుకునేలోపే ఓ అభిప్రాయం ఏర్పడుతోంది. ఆ ప్రభావం వ్యక్తి దగ్గరే ఆగకుండా కుటుంబాన్నీ తాకుతోంది. భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో హదులు దాటితే బాధ్యత ఎవరిది? చేతిలో సెల్ ఫోన్ ఉంటే మీడియా అన్నట్టేనా... సోషల్ మీడియాదే తుది తీర్పా? ఈశ్వర్ సాయి–మాధురి రాథోడ్ వ్యవహారం నేపథ్యంలో ఈ ప్రశ్నలు మరోసారి తెరపైకి వచ్చాయి.*

### వైరల్ వేగం.. నిజానికి విరామం

డిజిటల్ వేదికలు సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు చేరుస్తున్నాయి. అదే సమయంలో ధృవీకరణ లేని అంశాలు కూడా అంతే వేగంగా వ్యాపిస్తున్నాయి. ఒక ఆరోపణ బయటకు వస్తే.. నిజానిజాలు తేలకముందే షేర్లు, రీల్స్, కామెంట్లతో ప్రచారం పెరుగుతోంది. ఒకసారి ఏర్పడిన ముద్రను తర్వాత తొలగించడం అంత సులభం కాదన్న ఆందోళన ఉంది.

### ఒక్క ప్రచారం.. కుటుంబంపై ప్రభావం

ఆన్‌లైన్ వ్యాఖ్యలు సంబంధిత వ్యక్తికే పరిమితం కావడం లేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే ఎవరి గురించి అయినా మాట్లాడే ముందు ఆధారాలు పరిశీలించాల్సిన అవసరం ఉందన్న వాదన వినిపిస్తోంది. తొందరపాటు మాట.. తీరని గాయం అన్న సామెతలా.. ఒక్క వ్యాఖ్య కూడా తీవ్ర పరిణామాలకు దారితీయొచ్చన్న హెచ్చరికలు వస్తున్నాయి.

2



తెలంగాణ పెట్టుబడులను

## అడ్డుకునే కుట్ర

### గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ

2

**సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం**

**అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం**

**పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది**

**నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు**

**సిఎం రేవంత్ మండిపాటు**

పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు.

**హైదరాబాద్,ఆగస్ట్24 (సింగిడి)**

క్రమశిక్షణ కమిటీకి

## కొండాసురేఖ వ్యవహారం

ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు


**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు**

**రాజకీయ వ్యవహారాలపై ప్రజాపతినిధులతో రేవంత్ చర్చ**

2

కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు.

**హైదరాబాద్,ఆగస్ట్24 (సింగిడి):**



సెప్టెంబరు 7 నుంచి

## అసెంబ్లీ సమావేశాలు

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సెప్టెంబరు 7 నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ, శాసనమండలిని ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై తొలి రోజు సమావేశం తర్వాత జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీలో నిర్ణయిస్తారు. ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టనుంది.

**హైదరాబాద్,ఆగస్ట్24 (సింగిడి):**



కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో

## కొండా సుష్మిత వ్యవహారం

**కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం**

**సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్**

**మెదకలో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్**

2

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. **మెదక,ఆగస్ట్24 (సింగిడి):**





2

కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి

## స్వల్ప ఊరట

దివ్యాంగ వధువులకు సాయం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**హైదరాబాద్,ఆగస్ట్24 (సింగిడి):**

ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే

## సాధ్యం కాదు

**22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలు**

**అప్‌లోడ్ చేశామన్న మంత్రి పొంగులేటి**

**స్లాట్లు బుక్ చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో**

**ఖాతాలో జమ చేస్తామని వెల్లడి**

**22ఏకి సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగితే**

**24 గంటల్లో క్లియర్ చేశాం : పొంగులేటి**



**హైదరాబాద్,ఆగస్ట్24 (సింగిడి):** 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదన్నారు. మేడ్చల్‌లోని భూధాన్ భూముల్లో వాటిని తిరస్కరించామని వెల్లడించారు. స్లాట్లు బుక్ చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈనెల 18 నుంచి టోల్‌ఫ్రీ నంబర్‌కు 1162 కాల్స్ వచ్చాయని, వాటిని జిల్లాల వారిగా పంపించినట్లుగా పొంగులేటి తెలిపారు. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ అశంపై ప్రతి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. 22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలోని ఉన్న వివరాలు అప్‌లోడ్ చేశామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదని వివరించారు. మేడ్చల్,

...మిగతా 2లో



## బీజేపీలో సురేఖ?

చేరికపై పార్టీదే నిర్ణయం: డీకే అరుణ

2

**పవన్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ కోరినట్లు వెల్లడి**

**బీజేపీ ఎంపీలంతా కలిసే ఉన్నారని స్పష్టీకరణ**

**ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కే ఉందంటూ విమర్శ**

**రేవంత్ అమెరికా పర్యటనపై కూడా డీకే అరుణ స్పందన**

మహిళలకు తమిళ సిఎం

## వరాలు

**ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన**

**ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం**

2



**చెన్నై,ఆగస్ట్24 (సింగిడి):** తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

ఏఈ కుటుంబంపై

## మాతమార్పిడి కోసం ఒత్తిడి



2

**సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు**

**రెండు వేర్వేరు సూసైడ్ లేఖలు స్వాధీనం**

**జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడి**

ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

**కాకినాడ,ఆగస్ట్24 (సింగిడి)**

కొత్త మొక్కజొన్న వంగడం

## ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

**విదేశీ హైబ్రిడ్ విత్తనాల వాడకాన్ని తగ్గించుకోవాలి**

**స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి**

**రైతులను సూచించిన రాధాకృష్ణన్**

**సిఎం చంద్రబాబు, గవర్నర్ నజీర్ హాజరు**

2

**ముసునూరు, ఆగష్టు, 24 (సింగిడి):** ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ఆధ్వర్యంలో జన్యుపరంగా మార్పు చేయని (నాన్–జీఎంఓ) మొక్కజొన్న వంగడాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తో కలిసి ఆవిష్కరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన కార్యక్రమంను జ్యోతి ప్రజ్వలనతో ఉపరాష్ట్రపతి చేయగా, వందేమాతరం, జనగణమన జాతీయ గీతాలు, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలతో కార్యక్రమం ప్రారంభమైంది.



### డేటా ఆధారిత పాలన మరింత బలోపేతం

**ఆర్టీజీఎస్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష**

గినియాలో కూలిన

## డంపింగ్ యార్డు

**ప్రమాదంలో 30 మంది దుర్మరణం**



2

**న్యూఢిల్లీ,ఆగస్ట్24 (సింగిడి):** పశ్చిమ ఆఫ్రికాలోని గినియాలో ఓ డంపింగ్ యార్డ్ కూలడంతో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా సహాయక బృందాలు వారిని ఆస్పత్రికి తరలించాయి.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
25 ఆగస్టు 2026

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే
# అంతే సంగతులు

ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక డీ–డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

**వాషింగ్టన్,ఆగస్ట్24 (సింగిడి):**

ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందనీ, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం. అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటివరకు చేపట్టని అతిపెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లూ ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్. హయాంలో ఆ శకం ముగిసింది. టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకారం అందిస్తోన్న దేశాలు తీవ్ర పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ప్రతి సంస్థ, ఏజెన్సీని తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక యుద్ధం సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్కాట్ బెసెంట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## మహిళలకు తమిళ సిఎం వరాలు

**చెన్నై ఆగస్ట్ 24 (సింగిడి)**

బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

## గినియాలో కూలిన డంపింగ్ యార్డు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 (సింగిడి)**

గినియా రాజధాని కొనక్రిలో ఈ ప్రమాదం జరిగింది. భారీ వర్షాల కారణంగా డంపింగ్ యార్డ్ కుప్పకూలినట్టు తెలుస్తోంది. మృతిచెందిన 30 మందిలో ఇప్పటి వరకు 18 మృతదేహాలను వెలికితీసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారనే అనుమానంతో రక్షణ బృందాలను రంగంలోకి దించినట్టు గినియా ప్రభుత్వం తెలిపింది. అయితే.. అక్కడ ప్రమాదం జరిగే అవకాశమున్నట్టు తాము ముందే ఊహించామని, స్థానికులను వేరే ప్రాంతానికి వెళ్లాలని ఇటీవలే ఆదేశించామని చెప్పింది.

## డేటా ఆధారిత పాలన మరింత బలోపేతం

**అమరావతి,ఆగస్ట్24 (సింగిడి):**

డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన రియల్ టైమ్ గవర్నెన్స్ పై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. అలాగే సచివాలయంలో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. డేటా, ఎఐ తదితర అంశాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 'మన మిత్ర' సేవలపై చర్చించారు. ప్లాట్‌ఫామ్ పని తీరును కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఆస్పత్రుల డేటా విశ్లేషణపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లు, రీ–సర్వే అంశాలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.రేషన్ పంపిణీ డేటా విశ్లేషణపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ, విద్య, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల హాజరయ్యారు.

## ఏఈ కుటుంబంపై మాతమార్పిడి కోసం ఒత్తిడి

ఈ రెండింటిలోనూ రైఫిల్ షఉటింగ్ కోచ్ సాధికఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక ఒత్తిడి తెచ్చాడని ఎస్సీ వెల్లడించాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేయగా, నిందితుడు సాధికఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లోగాలింపు చేపట్టామని అన్నారు. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చామన్నారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధికఫైకేసులు నమోదు చేశామన్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి.

# తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు.గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటననుఅడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సో'షేమ్' మీడియా..

**స్వేచ్ఛ ఉందని.. హద్దు దాటొచ్చా**


రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛకు రక్షణ కల్పించినా.. దానికి చట్టపరమైన పరిమితులు ఉన్నాయి. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం.. వాటిని విస్తృతంగా ప్రచారం చేయడం.. ఒకరి గౌరవాన్ని దెబ్బతీసే స్థాయికి తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసం? అన్నదే ఇప్పుడు ప్రశ్న.

**నిజాన్ని కప్పేసే వైరల్ ప్రచారం**

ఇలాంటి ప్రచారానికి అడ్డుకట్ట వేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. లేకపోతే.. ఇష్టానుసారంగా పోస్టులు, వీడియోలు చేస్తూ అసలు వాస్తవాన్ని మరుగునపడే పరిస్థితి ఏర్పడొచ్చన్న ఆందోళన ఉంది. అబద్ధం ముందుగా వైరల్ అయితే.. నిజం తర్వాత వచ్చినా నష్టం పూడ్చడం కష్టమే.

**వైరల్ ముందు.. విచారణ ఎక్కడ?**

ఈశ్వర్ సాయి–మాధురి రాథోడ్ వ్యవహారం ఇదే చర్చకు మరోసారి కారణమైంది. ఆరోపణల్లో నిజం ఉంటే చట్టం తన పని తాను చేయాలి.. లేకపోతే నిరాధార ప్రచారానికి అడ్డుకట్ట పడాలి. భావ స్వేచ్ఛకు విలువ ఉన్నట్టే.. ఎదుటివారి గౌరవానికి కూడా విలువ ఉండాలి. సోషల్ మీడియాలో వైరల్ కావడం నిజానికి కొలమానం కాదు.. డిజిటల్ తీర్పే అంతిమ తీర్పు కాదు.




### కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి
## స్వల్ప ఊరట

**హైదరాబాద్,ఆగస్ట్24 (సింగిడి):**

తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.


### కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో
## కొండా సుష్మిత వ్యవహారం

ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## బీజేపీలో కొండా?

తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ భవిష్యత్‌పై చర్చ జరుగుతున్న వేళ, ఆమె బీజేపీలో చేరతారన్న ఊహాగానాలపై ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను పార్టీలోకి తీసుకోవాలా? వద్దా? అనేది బీజేపీ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన డీకే అరుణ పలు అంశాలపై స్పందించారు. ఈసారి మహబూబ్‌నగర్ స్థానికులకే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని ఎన్నికల్లో పనిచేసిన పవన్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పార్టీని కోరినట్లు చెప్పారు. బీజేపీ జాతీయ నూతన కమిటీపై స్పందిస్తూ, ఒక బాధ్యత నుంచి తొలగిస్తే అంతకంటే మంచి బాధ్యత ఇస్తారేమోనని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ మంత్రి అయిన తర్వాత పార్టీ బాధ్యతలు ఉండవని, తాను ఎంపీ అయిన తర్వాత సమయం లేక కర్ణాటక ఇన్‌ఛార్జి బాధ్యతలను వదిలేశానని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలందరూ ఐక్యంగానే ఉన్నారని డీకే అరుణ స్పష్టం చేశారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కే ఉందని, ఎవరిని గద్దె దించి ఎవరిని నియమిస్తారో చూడాలని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై ఆంక్షల అంశంపైనా ఆమె స్పందించారు. రేవంత్‌రెడ్డికి అన్ని విషయాలు తెలుసని, పాస్‌పోర్టుకు కూడా క్లియరెన్స్ అవసరమని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదు




రంగారెడ్డి జిల్లాల్లో సీఎస్7,14కు సంబంధించిన వివాదాలు ఉన్నాయని, భూములకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదం ఉందన్నారు. సీఎస్ 7, 14కు సంబంధించి గతంలో రేవంత్ రెడ్డి పోరాడారని పొంగులేటి గుర్తుచేశారు. 22ఏకి సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిలో 24 గంటల్లో క్లియర్ చేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా ఒకటి రెండు ఆగిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రిజిస్టేషన్లు చేయాలని లేఖలు రాస్తున్నారన్నారు. నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించామని ఆయన వెల్లడించారు. "22ఏ జాబితాలోనివి వివిధ జీవోలు, మెమోల్లో ఉన్న వివరాలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశాం. 98 శాతం స్లాట్‌లు బుక్ చేసుకున్న వారందరివి రిజిస్ట్రేషన్లు చేయగలిగేవి. 22ఏ పరిధిలోకి రిలాక్సేషన్ చేసిన వాటిని క్లియర్ చేశాం. మేడ్చల్, రంగారెడ్డిలోని కొన్నిచోట్ల దేవాదాయ, భూధాన్ భూముల్లో ఉన్న కారణంగా వాటికి సంబంధించిన వాటిని చేయలేమని రిజెక్ట్ చేయడం జరిగింది. స్లాట్‌లు బుక్ చేసిన వారు చెల్లించిన రిజిస్ట్రేషన్‌లు ఫీజులను వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుంది. భూదాన్‌కు సంబంధించిన భూముల సమస్యల పరిష్కారానికి కొంత సమయం పడుతుంది. వాటికి సంబంధించిన కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయి. ఆ భూముల ఆసాములు తొందర పడొద్దు, వాటిని పరిష్కరిస్తాం"– పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి

### కొత్త మొక్కజొన్న వంగడం
## ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ మాట్లాడుతూ విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత మరియు స్వయం సమృద్ధిని సాధించడం అత్యంత కీలకమైన అంశం అన్నారు. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ దిగుమతి చేసుకోకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందని ప్రశంసలు అందుతున్నాయన్నారు. దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపు లో వ్యవసాయ రంగం సుమారు 1/5వ వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1% మందికి ఉపాధిని, 55% జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40,000 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు అర్జిస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం–కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే 'నమో డ్రోన్ దీదీ' వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు. అదే సమయంలో,



వ్యవసాయాభివృద్ధికి సీఎం చంద్రబాబు రైతు బజార్లు, సహజ వ్యవసాయం వంటి విధానాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. దీనికితోడు భవిష్యత్ వ్యవసాయ సమృద్ధి కోసం దక్షిణ భారత నదుల అనుసంధానం మరియు అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమని స్పష్టమవుతోందన్నారు.

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని మునుసూరులో దేశంలోనే మొట్టమొదటి నాణ్యమైన, నాన్–జీఎమ్ఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాలను ఆవిష్కరించడం మరియు 8 రాష్ట్రాల ఉత్తమ రైతులకు సన్మానం చేయడం సంతోషకరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతాంగమే వెన్నెముక అని, 140 కోట్ల మందికి అన్నం పెడుతూ 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధి కల్పిస్తోందని గుర్తుచేశారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో 3వ అతిపెద్ద పంటగా నిలుస్తోందని, ఎల్–నినో వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునేలా పరిశోధనలు మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారతీయ వాతావరణానికి అనువైన హైబ్రిడ్ విత్తనాలను అభివృద్ధి చేసి, ఐసీఏఆర్ ప్రశంసలు పొందిన 'గౌర్మెట్ పాప్‌కార్నికా' సంస్థను అభినందించారు. ఈ సంస్థ 8 రాష్ట్రాల్లోని 17,500 మందికి పైగా రైతులతో 39,500 ఎకరాల్లో సాగు చేస్తూ, గతంలో అర్జెంటీనా, బ్రెజిల్‌లకు వెళ్లే ఆదాయంలో 70 శాతం నేరుగా మన భారతీయ రైతులకు దక్కేలా చేస్తోందని, తద్వారా 100 మిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేస్తోందని కొనియాడారు. అరకు కాఫీ లాగే ఈ పాప్‌కార్న్ కూడా ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. భవిష్యత్తు కూడా మారుతుంది. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి– కృష్ణా, తుంగభద్ర, పెన్నా– కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు, గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర బాబు, మహీధర్ రెడ్డి, యుగంధర్, ప్రిఫర్డ్ పాప్ కార్న్ సీఈఓ నార్మ్ కూర్, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో విశేష సేవలందించిన రైతులను ఉప రాపతి ఘనంగా సన్మానించగా, అతిధులను దుశ్శాలువా, కొండపల్లి బొమ్మలతో గోర్మే పాప్‌కార్నికా సంస్థ ప్రతినిధులు సన్మానించారు.

### క్రమశిక్షణ కమిటీకి
## కొండా సురేఖ వ్యవహారం

పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని.. ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. భూసేకరణ, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మాయి, మందల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లకి, కాంత రావు,రామ్ దాస్ నాయక,కడియం శ్రీహరి,డాక్టర్ సంజరు,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

సింగిడి
Singidi
మంగళవారం 25-8-2026




# గుమ్మడిదల అభివృద్ధికి.. సంపూర్ణ సహకారం

- మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత..
- అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం అభినందనీయం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఒక కోటి 69 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పటాన్చెరు, ఆగస్టు 24(సింగిడి):** నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లిలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో 86 లక్షల 50 వేల రూపాయలతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, వీరన్న గూడెంలో 15 లక్షల సిఆర్ఆర్ నిధులతో అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు, గుమ్మడిదల లో హానర్ ల్యాబ్స్, మైత్రి పరిశ్రమల సౌజన్యంతో 45 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణ పనులకు ఆయన



శంకుస్థాపన చేశారు.. అనంతరం నాగిరెడ్డిగూడెం గ్రామంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో 22 లక్షల రూపాయలగో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా అభివృద్ధి పనులను రూపొంది స్తున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులు బలోపేతం చేయడం ద్వారా ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతు న్నామని చెప్పారు.

గుమ్మడిదల ప్రాంత అభివృద్ధిలో పరిశ్రమల యాజమాన్యాలు, పారిశ్రామిక సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సహకారం కూడా అందితే అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గుమ్మడిదల మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేసి, ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 24(సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరాల్లన్నదే ప్రభుత్వం లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రతి అర్హ కుటుం బానికి చేరవేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మెరుగైన, సులభమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు పారదర్శకంగా చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డును కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు కుటుంబాల్లో కొత్తగా అర్హత పొందిన సభ్యుల పేర్లను కూడా చేర్చే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 24(సింగిడి):** రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను జీవో 97 ద్వారా శక్తి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి విలీనం చేయడాన్ని నిరసిస్తూ వికారాబాద్ కలెక్టరేట్ ముందు పాలిటెక్నిక్ విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 3 ఏళ్ల డిప్లొమా కోర్సును కేవలం నైపుణ్య శిక్షణకే పరిమితం చేస్తే తమ భవిష్యత్తు నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విలీనం వల్ల బీటెక్ 2వ సంవత్సరంలో నేరుగా ప్రవేశం కల్పించే ఈసిఇటి (ఈ సెట్ ) లేటరల్ ఎంట్రీ అవకాశం కోల్పోతామని భయపడు తున్నారు. అలాగే ఎస్ బీటెట్ స్వయంప్రతిపత్తి దెబ్బతిని ఫీజుల భారం పెరుగుతుందని వాపోయారు. ?తక్షణమే ప్రభుత్వం స్పందించి జీవో 97ను ఉపసంహరించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా విద్యార్థులు నిర్వహించనున్న ధర్నాకు హాజరై, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు తెలిపేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ రాజేందర్ గౌడ్ ను వికారాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న జీవో నెం 97ను వెంటనే రద్దు చేయాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై



శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న తనను ముందస్తుగా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చి, జీవో నం. 97ను తక్షణమే రద్దు చేయాలని రాజేందర్ గౌడ్ గారు డిమాండ్ చేశారు.

## కూకట్‌పల్లి మండి రెస్టారెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**కూకట్‌పల్లి, ఆగస్టు 24 (సింగిడి):** కూకట్‌పల్లి నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'కూకట్‌పల్లి మండి' రెస్టారెంట్‌ను స్థానిక శాసనసభ్యులు మాధ వరం కృష్ణారావు సోమవారం ప్రారంభిం చారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో రెస్టారెంట్ యజమానులు ప్రవీణ్, జగదీశ్ లు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే రెస్టారెంట్ ప్రాంగణాన్ని కలియయూ తిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ నాణ్యమైన ఆహారాన్ని, అత్యుత్తమ సేవలను అందిస్తూ ఈ రెస్టారెంట్ వ్యాపార రంగంలో ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ప్రభాకర్ గౌడ్, వెంకటేష్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, శారద తదితరులు పాల్గొన్నారు.

## దైవ కార్యానికి ఎమ్మెల్యే దాతృత్వ హస్తం

- జిన్నారంలో పోచమ్మ దేవాలయం నిర్మాణానికి రూ.12 లక్షల భారీ విరాళం
- నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు, చర్చిలు..

**పటాన్చెరు, ఆగస్టు 24(సింగిడి):** ఒక వైపు ప్రజాసేవలో.. మరో వైపు భక్తి సేవలో తనదైన ముద్రను చాటుతున్నారు పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా పరమతసహనం పెంపొందిస్తూ.. సొంత నిధులతో గుడులు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తున్నారు. తాజాగా.. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి 12 లక్షల రూపాయల భారీ విరాళం అందించి తన దైవభక్తిని మరోమారు చాటుకున్నారు. సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ




నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి.. ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవను తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా.. ప్రజలను ఐక్యం చేసే సామాజిక వేదికలని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సొంత నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా 200 లకు పైగా దేవాలయాలు, మసీదులు, ఆశిర్ఖానాలు, చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం ఆధ్యాత్మికతను ప్రోత్సహించడంతో పాటు ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్ సేవా కార్యక్రమాలు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మండల ప్రజావాణిలో 8 దరఖాస్తుల స్వీకరణ



**కాటారం, ఆగస్టు 24 (సింగిడి):** కాటారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజుతో పాటు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 8 మంది తమ సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులు అందజేశారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 7 దరఖాస్తులు కాగా, సీడీపీఓ కార్యాలయానికి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో బాబు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంకట విమోచన వీరాంజనేయ స్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవంలో పాల్గొన్న భరత్ సింహారెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 24(సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర కాలనీ(వెస్ట్) లో శ్రీ సంకట విమోచన వీరాంజనేయ స్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవ మహోత్సవ వేడుకలకు మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసింహా రెడ్డి,మాధవ రెడ్డి,జనరల్ సెక్రటరీ సతీష్ చక్రవర్తి, వెంకట్ రెడ్డి,సిద్ది రాములు,శివన్ దాన్,కాలే మహేష్, నవీన్ రెడ్డి, శ్రవణ్ బోస్,హరి, రోహిత్, ప్రణీత్, నాగరాజ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 24 (సింగిడి):** ప్రజావాణిలో స్వీ కరించిన ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు మరియు సమస్యలకు సంబంధించిన 109 దరఖాస్తులను స్వీకరించారు. పెన్షన్, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, సంబందిత శాఖలకు సంబంధించి దరఖాస్తు లను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబందిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరిం చాలని ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖల వారిగా పెండింగ్ ఉన్న వాటిని త్వరితిగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశిం చారు. ప్రతి సోమవారము ప్రతి మండలం ఏం పి డి ఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించ బడుతుందని, మండలాలలో ఉండే ప్రజలు ప్రతి సోమవారం మండలాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని' మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన తెలిపారు.

కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల విషయంలో బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

- రంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 24 (సింగిడి):** రంగారెడ్డి జిల్లాలో 22ఏ జాబితాలో ఉన్న భూములు, భూభారతి రికార్డులకు సంబంధించిన విషయాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి స్పష్టం చేశారు. బ్రోకర్లు, మధ్యవర్తుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు భూముల రికార్డులను సరిచేస్తామని, 22ఏ జాబితా నుంచి భూములను తొలగిస్తామని, భూభారతి ద్వారా భూమిపై హక్కులు కల్పిస్తామని నమ్మిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఇలాంటి అనధికారిక వ్యక్తుల మాటలను నమ్మి ఎవరూ ఆర్థికంగా నష్టపోవద్దని ఆయన స్పష్టం చేశారు. భూమిని కొనుగోలు చేసే ముందు లేదా భూ లావాదేవీలు నిర్వహించే ముందు ప్రజలు తప్పనిసరిగా సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సర్వే నంబర్, భూమి ప్రస్తుత స్థితి, 22ఏ జాబితాలోని వివరాలు, భూభారతి రికార్డులు తదితర చట్టపరమైన అంశాలను అధికారికంగా నిర్ధారించుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయిస్తామంటూ తిరిగే మధ్యవర్తులకు ఎటువంటి డబ్బులు చెల్లించవద్దని ఆయన తేల్చిచెప్పారు. భూములకు సంబంధించి ఏవైనా సందేహాలు, సమస్యలు ఉంటే, నేరుగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, అధికారిక రెవెన్యూ అధికారులను సంప్రదించి స్పష్టత పొందాలని సూచించారు. భూ లావాదేవీల్లో కేవలం అధికారిక విధానాలను మాత్రమే అనుసరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాల పంపిణీ





**వికారాబాద్ ప్రతినిధి, ఆగస్టు 24(సింగిడి):** వికారాబాద్ జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం ఆర్కతలలో జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి డిఆర్‌డివో వికారాబాద్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, 30 రోజుల టైలరింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా శిక్షణార్థులకు సోమవారం కలెక్టరేట్ లో సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈజీఎంఎం జెడిఎం బి. సుధాకర్, ట్రైనర్ మల్లయ్య, జూనియర్ రిసోర్స్ పర్సన్స్ నరసింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

## పద్మానగర్ ఫేజ్--1 నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల సర్కిల్ పద్మానగర్ ఫేజ్--1 కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అధికారులను కోరారు. సోమవారం కాలనీని సందర్శించిన ఆయన, స్థానికులతో మాట్లాడి నీటి సరఫరా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ మాధవినిని కలిసి సమస్యను వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని కూన శ్రీశైలం గౌడ్ కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మరియు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం రాజేందర్ రెడ్డి, దుర్గారావుతో పాటు స్థానిక కాలనీవాసులు



ముత్యాలు, శివ నాగిరెడ్డి, మోహన్ సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణు, సత్యం, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణీదేవి ఒడిలో 'నిషేధ' ముల్లు

## తెలంగాణలో 22-ఏ భూముల సంక్షోభం

భూమి కేవలం మట్టి కాదు; అది తరతరాల చెమట బిందువుల సమాహారం, ఆర్థిక భద్రతకు తిరుగులేని మూలస్తంభం, మానవ జీవన వికాసానికి ప్రాణాధారం. తెలుగు సాహిత్యంలో 'ధరణీదేవి'గా కీర్తించబడిన ఈ అమూల్యమైన ఆస్తిపై స్పష్టమైన హక్కు ఉండటమే ఒక పౌరుడి నిజమైన స్వతంత్రానికి ప్రతీక. అయితే నేడు తెలంగాణ సమాజంలో భూ యజమానులు, సన్నకారు రైతులు, సాధారణ గృహ కొనుగోలుదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న ప్రధాన సంక్లిష్టత రిజిస్ట్రేషన్ చట్టం--1908లోని సెక్షన్ 22-ఏ. చట్టపరంగా ప్రభుత్వ, ప్రజా ప్రయోజనాలను పరిరక్షించడానికి ఏర్పడిన ఈ నిబంధన, క్షేత్రస్థాయి అమలులో ఎదురవుతున్న తీవ్ర లోపాల వల్ల వేలాది మంది నిజమైన యజమానుల భూ హక్కులకు పెద్ద సంకెళ్లుగా మారింది. ఒక స్థిరాస్తి ఈ నిషేధిత జాబితాలోకి చేరిన వెంటనే దాని క్రయవిక్రయాలు, వారసత్వ బదలాయింపులు, బ్యాంకు రుణాలు పూర్తిగా స్తంభించిపోయి, సదరు యజమాని తీవ్రమైన ఆర్థిక, మానసిక క్షోభకు గురికావాల్సి వస్తోంది.



?రిజిస్ట్రేషన్ చట్టం--1908లోని సెక్షన్ 22-ఏ వెనుక ఉన్న చట్టబద్ధమైన పరమార్థం నిస్సందేహంగా పవిత్రమైనదే. ప్రభుత్వ భూములు, పేదలకు జీవనాధారంగా ఇచ్చిన అసైన్డ్ భూములు, దేవాలయాలకు చెందిన దేవాదాయ ఆస్తులు, ముస్లిం ధార్మిక సంస్థలకు చెందిన వక్ఫ్ భూములు, అటవీ ప్రాంతాలు, న్యాయస్థానాల స్టే ఉత్తర్వులలో ఉన్న వివాదాస్పద ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకోవడమే ఈ నిబంధన యొక్క ప్రాథమిక లక్ష్యం. ప్రజాధనాన్ని, పవిత్రమైన ధార్మిక ఆస్తులను భూమాఫియా మరియు అక్రమార్కుల కబంధహస్తాల నుంచి రక్షించాల్సిన బాధ్యత సంక్షేమ రాజ్యానికి ఎంతైనా ఉంది. ఈ రక్షణ కవచం లేకపోతే వ్యవస్థలో అక్రమ రిజిస్ట్రేషన్లు పెచ్చరిల్లిపోయే ప్రమాదం ఉంది. కానీ, ఆశయం ఎంత ఉన్నతమైనదో, దాని ఆచరణాత్మక కార్యాచరణ అంతగా గాడి తప్పడమే ఇక్కడ అసలైన సంక్షోభానికి దారితీసింది.

?సమస్య నిబంధనలో లేదు, రెవెన్యూ యంత్రాంగం తయారుచేసే నిషేధిత జాబితాల అసమగ్రతలోనే వేళ్లూనుకుని ఉంది. దశాబ్దాలుగా చట్టబద్ధమైన రిజిస్టర్డ్ దస్తావేజులు కలిగి ఉండి, పట్టాదారు పాస్ పుస్తకాలతో సాగు చేసుకుంటున్న నిజమైన యజమానుల ప్రైవేటు భూములు కూడా ఈ జాబితాలోకి అకారణంగా వచ్చి చేరుతున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్ల విభజన సరిగ్గా లేకపోవడం, ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేటు పట్టా భూమి ఉన్నప్పుడు ఆ మొత్తం సర్వే నంబర్‌ను గుడ్డిగా నిషేధిత జాబితాలో చేర్చడం, పాత ఖాస్రా పహాణీల రికార్డుల లోపాలు, డిజిటలైజేషన్ సమయంలో జరిగిన డేటా ఎంట్రీ తప్పిదాలు సాధారణ ప్రజలకు శాపంగా మారాయి. కన్నబిడ్డ పెళ్లికో, అత్యవసర వైద్య ఖర్చులకో చేతిలో ఉన్న ఎకరం భూమిని అమ్ముకుందామనుకున్న సన్నకారు రైతుకు, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిన తర్వాత అది '22-ఏ'లో ఉందన్న కఠిన వాస్తవం ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే వేదన వర్ణనాతీతం.

?తెలంగాణలో భూ రికార్డుల ప్రక్షాళన, సరిదిద్దే ప్రక్రియలు నిరంతరం జరుగుతున్నప్పటికీ, నిషేధిత భూముల పరిధి నానాటికీ విస్తరించడం మరింత గందరగోళాన్ని సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా దాదాపు 93 లక్షల ఎకరాల మేర భూములను వివిధ నిషేధిత ఉప-వర్గాల కింద పరిగణిస్తూ జాబితాలు సిద్ధం చేయడంపై పెద్దఎత్తున చర్చలు నడిచాయి. ఇంత భారీ విస్తీర్ణంలో అసలైన ప్రభుత్వ ఆస్తులతో పాటు ఏమాత్రం సంబంధం లేని అమాయకుల పట్టా భూములు, పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థిరాస్తులు కలగలిసిపోవడం తీవ్రమైన పరిపాలనా లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రభుత్వ శాఖలైన రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, దేవాదాయ, వక్ఫ్ మరియు అటవీ శాఖల మధ్య పరస్పర సమన్వయం లేకపోవడం వల్ల ఒక శాఖ వద్ద క్లియర్ గా ఉన్న భూమి, మరో శాఖ రికార్డుల్లో నిషేధిత వర్గంలో దర్శనమిస్తోంది.

?ఈ వైరుధ్యాల పర్యవసానంగా తెలంగాణ హైకోర్టులో వేలాది రిట్ పిటిషన్లు దాఖలవుతున్నాయి. 22-ఏ నిషేధిత జాబితాపై యజమానులు న్యాయస్థానాలను ఆశ్రయించగా, ఉన్నత న్యాయస్థానం పలు సందర్భాల్లో పరిపాలనా విభాగాల ఏకపక్ష వైఖరిని తప్పుబట్టింది. రాజ్యాంగంలోని అధికరణ 300-ఏ ప్రకారం పౌరుడి ఆస్తి హక్కు చట్టబద్ధమైన రక్షణను కలిగి ఉందని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, భూ యజమానికి ముందస్తు నోటీసు ఇవ్వకుండా లేదా అతని వివరణ తీసుకోకుండా రాత్రికి రాత్రే ఏ భూమినీ నిషేధిత జాబితాలో చేర్చడానికి వీల్లేదని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. క్షేత్రస్థాయి సమగ్ర పరిశీలన జరపకుండా, కేవలం ఏదో ఒక శాఖ పంపిన అసమగ్ర జాబితా ఆధారంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం చట్టవిరుద్ధమని ఆదేశాలు వెలువడ్డాయి. అయినప్పటికీ, కోర్టుకెళ్లి డిక్రీలు తెచ్చుకునే ఆర్థిక స్తోమత లేని సామాన్య రైతులకు ఈ న్యాయపోరాటం ఒక భారంగా మారింది.

?22-ఏ జాబితాలో ఒక భూమి ఉన్నంత మాత్రాన ఆ భూమిపై సదరు వ్యక్తికి యాజమాన్య హక్కు పూర్తిగా రద్దయిపోయినట్లు కాదన్నది ఒక ప్రాథమిక అంశం; అది కేవలం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై తాత్కాలిక లేదా శాశ్వత నిషేధాన్ని మాత్రమే సూచిస్తుంది. అయితే వ్యావహారిక సమాజంలో రిజిస్ట్రేషన్ నిలిచిపోవడమంటే ఆస్తి విలువ సున్నాగా మారడమే. భూమి అసలు ఏ కారణం చేత జాబితాలో చేరిందో స్పష్టంగా విభజించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒకవేళ అది రికార్డుల తప్పిదం వల్ల చేరిన ప్రైవేటు భూమి అయితే తక్షణమే తొలగించే సరళమైన యంత్రాంగం ఉండాలి. అసైన్డ్ భూమి అయితే చట్టపరిధి ప్రకారం పరిశీలించాలి, దేవాదాయ లేదా వక్ఫ్ భూమి అయితే గెజిట్ నోటిఫికేషన్లు, లింక్ డాక్యుమెంట్లు, సరిహద్దుల నిర్ధారణ పక్కాగా జరగాలి. అన్నింటినీ ఒకే గాటన కట్టడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం.

?భూ పరిపాలనలో పారదర్శకత సాధించాలంటే ఆధునిక సాంకేతికతతో కూడిన భూమి రీ-సర్వే, జీఐఎస్ మ్యాపింగ్, ఉపగ్రహ ఆధారిత సరిహద్దుల నిర్ధారణ అత్యంత శాస్త్రీయంగా జరగాలి. నిషేధిత జాబితాలోని ప్రతి సర్వే నంబరుకు సంబంధించిన ఆధార పత్రాలు, గెజిట్ కాపీలు, రెవెన్యూ ఉత్తర్వులు పబ్లిక్ డొమైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అన్యాయంగా జాబితాలో చేరిన భూముల తొలగింపు కోసం కలెక్టరేట్ లేదా ఆర్డీవో స్థాయిలో నిర్ణీత గడువుతో కూడిన ప్రత్యేక గ్రీవెన్స్ మరియు అప్పిలేట్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. భూ యజమానికి తన వాదనను, దస్తావేజులను సమర్పించేందుకు సంపూర్ణ అవకాశం కల్పించినప్పుడే పరిపాలనపై ప్రజా విశ్వాసం నిలుస్తుంది.

?రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, స్థిరాస్తి రంగ సమగ్ర విస్తరణకు భూ రికార్డుల స్వచ్ఛత అత్యంత కీలకమైన పునాది. భూమిని తల్లిగా భావించే సాంస్కృతిక నేపథ్యం ఉన్న మన నేలపై, ఒక పౌరుడు తన సొంత భూమి కోసం ఆఫీసుల చుట్టూ, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సి రావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు శోభనివ్వదు. ప్రభుత్వ, ధార్మిక ఆస్తుల పరిరక్షణ ఎంత పవిత్రమైన విధియో, నిర్దోషులైన పౌరుల చట్టబద్ధ ఆస్తి హక్కులను కాపాడటం కూడా రాజ్యానికి అంతే ప్రాథమిక బాధ్యత. సెక్షన్ 22-ఏ అనేది ప్రభుత్వ భూములను కాపాడే గట్టి కంచెగా ఉండాలి తప్ప, నిజమైన యజమానుల హక్కులను అణచివేసే బండరాయిగా మారకూడదు; ఈ రెండు లక్ష్యాల మధ్య సరైన సమతుల్యతను సాధించినప్పుడే పారదర్శక భూపాలన సాకారమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఎడిటోరియల్

Editorial

## మెజారిటీ మౌనం.. సమ్మతా? సంకోచమా?

చాలామంది ఒక నిర్ణయంపై స్పందించకపోతే, దాన్ని వెంటనే సమ్మతిగా భావించడం సులభం. కానీ మౌనం వెనుక సంతృప్తి ఉండొచ్చు, సంకోచం ఉండొచ్చు, సమాచారం లోపం ఉండొచ్చు, మాట్లాడేందుకు సరైన వేదిక లేకపోవచ్చు. అందుకే ప్రజాస్వామ్యంలో "ఎంతమంది మాట్లాడారు?" అన్న ప్రశ్నతో పాటు "ఎంతమందికి మాట్లాడే అవకాశం ఉంది?" అన్న ప్రశ్నకూ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలు ప్రభుత్వ సేవలను ఉపయోగించినప్పుడు, స్థానిక సంస్థల నిర్ణయాలను ఎదుర్కొన్నప్పుడు లేదా విధానాలపై తమ అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు ఏర్పడే అనుభవాలు సంస్థలపై నమ్మకాన్ని ప్రభావితం చేస్తాయి. ఒక నిర్ణయం ప్రజలపై ప్రభావం చూపినప్పుడు, దాని గురించి సమాచారం ఎంతవరకు అందుబాటులో ఉంది, అభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు ఎలాంటి మార్గాలు ఉన్నాయి, ఆ అభిప్రాయానికి నిర్ణయ ప్రక్రియలో ఏ స్థానం లభించింది అన్నదే ప్రజాస్వామ్య నాణ్యతను అంచనా వేసే ముఖ్యమైన ప్రమాణాలు. కాబట్టి మౌనం ఒక ఫలితం కావచ్చు, కానీ దాని అర్థాన్ని ముందుగానే నిర్ణయించడం మాత్రం సరైన ప్రజాస్వామ్య పద్ధతి కాదు.

**ప్రజల మాటకు విలువ ఉందా?**

ప్రపంచ స్థాయిలో ప్రజా స్వరం--ప్రభుత్వ విశ్వాసం మధ్య సంబంధాన్ని తాజా గణాంకాలు కూడా సూచిస్తున్నాయి. 2026 జూన్ 29న విడుదలైన ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) ప్రభుత్వ సంస్థలపై నమ్మకానికి సంబంధించిన సర్వే ప్రకారం, సభ్యదేశాల్లో జాతీయ ప్రభుత్వంపై అధిక లేదా మితమైన నమ్మకం ఉందని చెప్పిన వారు సగటున 40 శాతం కాగా, తక్కువ లేదా నమ్మకం లేదని చెప్పిన వారు 43 శాతంగా ఉన్నారు. అదే అధ్యయనం ప్రకారం 68 శాతం మంది ఓటు ప్రభుత్వ చర్యలను ప్రభావితం చేస్తుందని భావించగా, తమలాంటి వ్యక్తులకు ప్రభుత్వ నిర్ణయాల్లో మాట ఉందని భావించిన వారు 31 శాతం మాత్రమే. ఎన్నికల ద్వారా ప్రజల రాజకీయ భాగస్వామ్యం వ్యక్తమైనప్పటికీ, నిర్ణయ ప్రక్రియలో తమకు స్వరం ఉందనే అనుభూతి కూడా ప్రజా విశ్వాసానికి కీలకంగా మారుతోంది. 2025 మే 23న ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రచురించిన మరో విశ్లేషణ పౌరుల భాగస్వామ్యాన్ని ఒకే దశలో జరిగే సంప్రదింపుగా కాకుండా, విధాన చక్రం అంతటా కొనసాగే ప్రక్రియగా అభివృద్ధి చేయాలని సూచించింది. అందుకోసం భాగస్వామ్యానికి ఉన్న అడ్డంకులను తగ్గించడం, పౌరులు--పరిపాలనా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచడం, ప్రజల భాగస్వామ్యానికి స్పష్టమైన ప్రభావం మరియు జవాబుదారీతనం కల్పించడం అవసరమని పేర్కొంది.

**స్థానికం నుంచి పార్లమెంట్ వరకు!**

భారతదేశంలో పౌర భాగస్వామ్యానికి రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టపరమైన మార్గాలు, ప్రజా సంస్థలు ఇప్పటికే ఉన్నాయి. సమాచార హక్కు, ప్రజాప్రతినిధులను సంప్రదించే అవకాశం, గ్రామసభలు, స్థానిక సంస్థల సమావేశాలు, ప్రజా సంప్రదింపులు వంటి మార్గాలు పౌరుడు-పాలన మధ్య అనుసంధానానికి ఉపయోగపడతాయి. అయితే వేదిక ఉండటం మాత్రమే సరిపోదు, సమాచారం అర్థమయ్యే భాషలో అందుతుందా? ప్రభావిత ప్రజల అభిప్రాయం నిర్ణయానికి ముందు నమోదు అవుతుందా? నిర్ణయం తీసుకున్న తర్వాత దాని కారణాలు ప్రజలకు తెలుస్తున్నాయా? అన్నదే తదుపరి పరీక్ష. డిజిటల్ పాలన ఈ ప్రక్రియను వేగవంతం చేయగలదు. కానీ ఇంటర్నెట్ అందుబాటు, డిజిటల్ నైపుణ్యం, భాష, పరికరాల లభ్యతలో ఉన్న వ్యత్యాసాలు పరిగణనలోకి రాకపోతే అదే సాంకేతికత కొత్త దూరాలను సృష్టించే అవకాశం ఉంది. అందువల్ల డిజిటల్ వేదికలు ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యానికి ప్రత్యామ్నాయం కాకుండా దానికి తోడ్పడే అదనపు మార్గాలుగా ఉండాలి. స్థానిక భాషల్లో సులభమైన సమాచారం, ప్రత్యక్ష సమావేశాలు, ఆన్‌లైన్ సంప్రదింపులు, నిర్ణయాలపై ప్రజలకు అందుబాటులో ఉండే వివరణలు కలిసినప్పుడే భాగస్వామ్యం విస్తృతమవుతుంది.

**మౌనం కనిపిస్తుంది.. కారణం వినిపించాలి**

ఒక ప్రాంతంలో ప్రజలు నిశ్శబ్దంగా ఉన్నారని చివరికి "మెజారిటీ ఎందుకు మౌనంగా ఉంది?" అన్న ప్రశ్నకు ఊహతో సమాధానం వెతకడం కంటే, "ప్రతి పౌరుడి స్వరం వినిపించేందుకు వ్యవస్థ ఎంత తెరుచుకుని ఉంది?" అన్న ప్రశ్నకు ఆచరణాత్మక సమాధానం వెతకడం ముఖ్యం. మౌనం సమ్మతికి సాక్ష్యం కాదు, అది ఒక ప్రశ్నకు సంకేతం కావచ్చు. సంభాషణ స్వరాన్నిస్తుంది.. పారదర్శకత నమ్మకాన్ని పెంచుతుంది..


వరుణ గ్రహాన్ని కనుగొన్న ఖగోళ శాస్త్రవేత్త

# విలియం హెర్చెల్

ఆగస్టు 25...

ఫ్రెడెరిక్ విలియం హెర్చెల్ వర్ధంతి

సర్ ఫ్రెడెరిక్ విలియం హెర్చెల్ (నవంబర్ 15, 1738 – ఆగష్టు 25, 1822) ఖగోళ శాస్త్రవేత్త. ఆధునిక పరికరాలు లేని కాలంలోనే అంతరిక్షంలోని అద్భుతాలను ఆవిష్కరించిన ఖగోళ శాస్త్రవేత్త సర్ ఫ్రెడెరిక్ విలియం హెర్చెల్. ఆయన వరుణ (యురేనస్) గ్రహాన్ని కనుక్కొన్నారు. మొదట మిలటరీ లోని బ్యాండు మేళంలో పనిచేసి, తన పరిశోధనలతో ప్రపంచంలోని మేటి ఖగోళ శాస్త్రవేత్తలలో ఒకరిగా ఎదిగారు. సర్ ఫ్రెడెరిక్ విలియం హెర్చెల్ తొమ్మిది గ్రహాలలో ఒకటైన



యురేనస్‌తో పాటు దానికున్న రెండు ఉపగ్రహాలను, శని, గురు గ్రహాలకు చెందిన రెండేసి ఉపగ్రహాలను కనుక్కున్నారు. స్వయంగా రూపొందించుకున్న టెలిస్కోపుల తోనే ఆయన నక్షత్ర మండలాల (గెలాక్సీలు) ఆకారాలతో పాటు, విశ్వం స్వరూపాన్ని కూడా అంచనా వేయడం విశేషం. దాదాపు 2500 నక్షత్ర సముచ్ఛయా (నెబ్యులా)లను, వాటికి సంబంధించిన సిద్ధాంతాలను వెలువరించారు. నక్షత్ర వర్ణపటాల తరంగదైర్ఘ్య పంపిణీని కొలవడానికి ప్రిజమ్స్, ఉష్ణోగ్రత కొలిచే పరికరాలను ఉపయోగించి, హెర్షెల్ ఖగోళ స్పెక్ట్రోఫోటోమెట్రీని ఉపయోగించారు. ఈ పరిశోధనల సమయంలో, హెర్షెల్ పరారుణ వికిరణాన్ని కనుగొన్నారు. సూర్యుని చలన మార్గాన్ని నిర్ధరించి, పరారుణ ఉష్ణతరంగాల ఉనికిని చెప్పినది కూడా ఆయనే. ఆయన సుమారు 400కు పైగా టెలిస్కోపులను ఆయన తయారు చేశారు. జర్మనీలోని హోనోవర్‌లో 1738 నవంబర్ 15 న జన్మించిన విలియం చిన్నప్పట్నించే వయోలిన్ వాయించడం నేర్చుకున్నారు. తండ్రితో కొంతకాలం మిలటరీ బ్యాండ్‌లో పనిచేసి, తరువాత అన్నతో ఇంగ్లండ్ వెళ్లిపోయారు. కొన్నేళ్లపాటు సంగీతం మీదనే ఆధారపడి బతికిన ఆయన తరువాత ఖగోళశాస్త్రంపై ఆసక్తిని పెంచుకుని టెలిస్కోపులతో అంతరిక్ష పరిశీలన చేసేవారు. 1774 లో హెర్షెల్ తన మొట్టమొదటి పెద్ద టెలిస్కోప్‌ను నిర్మించారు. అలా 1781లో యురేనస్‌ను కనుగొన్నారు. ఆ ఏడాదే కోప్లీ అవార్డుతో పాటు, ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎంపికయ్యారు. 'సర్' బిరుదును కూడా పొందారు. అప్పటి చక్రవర్తి జార్జి3 ఆయనను 'రాజ ఖగోళ పరిశీలకుడి' (రాయల్ ఆస్ట్రానమర్)గా నియమించారు. కొద్ది కాలానికే యురేనస్, శని, గురు గ్రహాల ఉపగ్రహాలను కూడా కనుగొన్నారు. చంద్రునిపై గల పర్వతాలను చూడడమే కాదు, వాటి ఎత్తును కూడా కనుగొన్నారు. 1820 లో స్థాపించ బడినప్పుడు రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీకి మొదటి అధ్యక్షులు. ప్రతిష్ఠాత్మకమైన నైట్‌హుడ్ సహా అనేక పురస్కారాలు పొందిన ఆయన, 1822 ఆగష్టు 25న తన 84వ ఏట మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**


# తెలుగు భాషామ తల్లికి దేవులపల్లిఎనలేని సేవలు

ఆగస్టు 25... దేవులపల్లి రామానుజ రావు జయంతి

**తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాష తెరమరుగు అవుతున్న సమయంలో, తెలుగు భాషను కాపాడిన స్వభాషాభిమానులలో దేవులపల్లి రామానుజరావు ఒకరు. జీవిత మంతా సాహితీ సేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి రామానుజరావు. విద్యార్థి దశ నుండే మాతృభాషపై మమకారం పెంచుకుని, తెలుగు భాషా వికాసానికి, ఔన్నత్యానికి పాటుపడిన ఒక గొప్ప సాహిత్యాభిమాని. నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచిన వారిలో రామానుజరావు ఒకరు. 1943లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్, 1956లో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వంటి అగ్రగామి సంస్థల స్థాపనకు ఎంతో కృషి చేసి, జీవిత కాలమంతా సారస్వత పరిషత్ ఉపాధ్యక్షుడుగా, అధ్యక్షుడుగా ఉన్నారు. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంత రావు, బూర్గుల రామకృష్ణరావు. స్వామి రామానంద తీర్థ వంటి పెద్దలతో తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసారు.**

దేవులపల్లి రామానుజరావు వరంగల్ జిల్లా బొల్లికుంటలో 1917 ఆగస్టు 25న కలిగిన కుటుంబంలో జన్మించారు. డిగ్రీలో చేరేదాకా వరంగల్లులో, తర్వాత నిజాం కళాశాలలో, మధ్యలో కొంత విరామం తర్వాత నాగపూర్‌లో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఉద్యోగం కోసం వెదకక, రాజకీయ, సాహిత్య రంగాల్లో కృషి చేశారు. సాహిత్య రంగంతోపాటు విద్యారంగం, గ్రంథాలయోద్యమం, విశ్వ విద్యాలయం, పత్రికా రచన, రాజకీయాలు, సహకారోద్యమం, ఆంధ్ర మహాసభ కార్యకలాపాలు, విశాలాంధ్రోద్యమం, రాజ్యసభ సభ్యత్వం- ఇలా తెలుగు వారి జీవితానికి సంబంధించిన సకల రంగాల్లోనూ ఆయన పాత్ర ఉంది.

1943 మే 23న ఏర్పడిన ఆంధ్ర సారస్వత పరిషత్తుతో ఆయనకు మొదటి నుంచి సంబంధం ఉంది. 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యవర్గ సభ్యుడిగా మొదలై, 1947లో కార్యదర్శి అయి, 1952లో తొలిసారి అధ్యక్షుడై మధ్యలో కొంత విరామం తప్ప జీవితం చాలించే దాకా ఆ సంస్థకు అధ్యక్షులుగా ఉన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగులో ప్రవేశ, విశారద లాంటి పరీక్షలు నిర్వహించింది. తెలుగు మాధ్యమంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత తెలుగు అధ్యాపకుల కొరత తీర్చింది ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారే. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ప్రాథమికోపాధ్యాయులు గానూ, విశారద పరీక్ష పూర్తి చేసిన వారిని ఉన్నత పాఠశాల అధ్యాపకులుగా నియమించేవారు. ఈ పరీక్షలు తెలంగాణలోనే కాక, తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నింటిలో... బెంగళూరు, మైసూరు, హోసూరు, బొంబాయి, షోలాపూర్ వంటి అనేక ప్రాంతాల్లో నిర్వహించేవారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి పండిత శిక్షణను కూడా రామానుజరావు



సారథ్యంలోని సారస్వత పరిషత్తే చేపట్టింది. అక్షరాస్యతా ప్రచారం, వయోజన విద్య కూడా పరిషత్తు కార్యక్రమాల్లో భాగం. 1953లో అలంపురంలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షిక సభల నిర్వహణ బాధ్యతను తలకెత్తుకున్నదీ ఆయనే. అప్పటి ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ సభలను ప్రారంభించడమే కాక రెండు రోజులూ వాటికి హాజరయ్యారు.

ఆ సభల్లోనే తెలంగాణ రచయితల సంఘం దాశరథి అధ్యక్షులుగా, సి.నారాయణరెడ్డి కార్యదర్శిగా, శ్రీశ్రీ గౌరవాధ్యక్షుడిగా ఏర్పాటైంది.

కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా 1957 నుంచి 1985 దాకా ఆయన జీవితంలో చాలా భాగం సాహిత్య అకాడమీతో ముడిపడింది. సాహిత్య అకాడమీ కార్యభారం మోసింది రామానుజరావే. అకాడమీ వృత్తి పదకోశాలు ప్రచురించడం, ప్రాచీన గ్రంథాలు ప్రచురించి చౌకగా అందుబాటు లోకి తేవడమూ ఆయన చలవే. సాహిత్య అకాడమీ నిర్వహణలో గానీ, సారస్వత పరిషత్తును నడపటంలో గాని రామానుజరావు తానే ఒక వ్యవస్థగా మారారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించినన్ని గ్రంథాలు దేశంలో మరే సాహిత్య అకాడమీ వెలువరించలేదు.

ఉస్మానియా యూనివర్సిటీతో రామానుజరావుకు అమితమైన సంబంధం ఉంది. 1953 నుంచి 1976 దాకా సెనేట్, సిండికేట్ సభ్యుడిగా ఉన్నారు. 1972, 1973, 1975లో మూడుసార్లు తాత్కాలిక ఉపకులపతిగా వ్యవహరించారు. 1960 నుంచి 1962 దాకా రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. నాడు తెలంగాణ ప్రాంతంలో ఉన్న ఒకే ఒక విశ్వ విద్యాలయం ఉస్మానియా. తెలుగు భాషకు ద్రోహం చేస్తూ, ఉర్దూను కృత్రిమత్వానికి గురిచేస్తూ కొందరు స్వార్థ పరులు ఉస్మానియాను హిందీ యూనివర్సిటీగా మార్చి కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని ప్రయత్నాలు చేశారు. ఉన్న ఒక్క విశ్వవిద్యాలయమూ పోయే పరిస్థితి ఎదురైనప్పుడు పౌర సంఘాన్ని ఏర్పాటు చేసి పోరాడి ఉస్మానియాను తెలుగువారికి దక్కించడంలో రామానుజరావు అద్వితీయ కృషి చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు, అఖిల భారత తెలుగు మహాసభలు అతి వైభవంగా జరిగాయి. ఈ సభం రూపకల్పనలో రామానుజరావు పాత్ర ప్రమేయం, ప్రాతినిధ్యం ప్రముఖం. 1974, జనవరిలో రవీంద్రభారతిలో జరిగిన రామానుజరావు స్మారకోమాసంలో నాటి భారత ప్రధాని పి.వి. తమ ప్రసంగంలో వారిద్దరూ కలిసి నాగపూర్లో న్యాయశాస్త్రాన్ని చదువుకున్న రోజులను గుర్తుచేసు కోవడం విశేషం. సాహిత్య సేవే జీవిత పరమావధిగా, కనీసం సొంత ఇల్లు కూడా సమ కూర్చు కోవడంపై దృష్టి నిలపక, ఆంధ్ర సారస్వత పరిషత్తుకు మాత్రం వందల కోట్ల రూపాయల ఆస్తులను సమకూర్చి పెట్టిన రామానుజరావు 1993, జూన్ 8న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. తెలుగు ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేసి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## న్యూ శ్రీనగర్ కాలనీలో పార్కు, డ్రైనేజీ సమస్యల పరిశీలన



- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం
- కార్పొరేటర్ నర్మద నర్సన్న

**కరీంనగర్, ఆగస్టు24(సింగిడి):** కట్టారాంపూర్‌లోని న్యూ శ్రీనగర్ కాలనీలో పార్కు సుందరీకరణ పనులు, డ్రైనేజీ సమస్యలను కార్పొరేటర్ నర్మద నర్సన్న పరిశీలించారు. కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు.

## జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



- అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటాం
- ప్రణవ్ హామీతో దీక్ష విరమించిన జర్నలిస్టులు

**జమ్మికుంట, ఆగస్టు 24 (సింగిడి):** ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తున్నామని, అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని వారి ఇళ్ల పట్టాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. సోమవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష స్థలిని ప్రణవ్ సందర్శించారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడతానని సమస్యను పరిష్కరించే విషయంలో కృషి చేస్తానని వారికి వివరించారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఇచ్చిన పట్టాలను మరల న్యాయపరమైన ఇబ్బందులు కలగకుండా చూస్తామని, జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు పట్టణ, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 43వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### నాణ్యతా ప్రమాణాలతో పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, ఆగస్టు 24 (సింగిడి):** నగరపాలక సంస్థ 43వ డివిజన్‌లో సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పొన్నం లక్ష్మి మొండయ్య, కార్పొరేటర్లు తోట అనిల్, ఏపీపీ చంద్ర, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## 27న ఉద్యోగుల మహాధర్నాను విజయవంతం చేయాలి

### ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అధికారులు తరలిరావాలి

### ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 24(సింగిడి):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అధికారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. టీఎన్జీవో కమ్యూనిటీ భవనంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అధికారులు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకోవాలని కోరారు. ఉద్యోగులు ఉచితాలు, దానధర్మాలు కోరడం లేదని, తమకు రావాల్సిన హక్కులను మాత్రమే డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఆరు నెలలకు కరువు భత్యం, ప్రతి ఏడాది వార్షిక వేతన పెంపు, ఐదేళ్లకోసారి వేతన సవరణ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, ఆరు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయని, వేతన సవరణ అమలు కాలేదని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు తమ సొంత పొదుపు సొమ్ము కోసం కూడా ఆందోళనలు, న్యాయపోరాటాలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 1న 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టాలని, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి మహాధర్నాను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంప్లాయీస్ జేఏసీ కార్యదర్శి జనరల్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావుతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బి శాఖలో తెలంగాణ ఎన్జీవోల సంఘం సభ్యత్వ నమోదు

- పెండింగ్ డీఏలు, పీఆర్సీ వెంటనే మంజూరు చేయాలి
- జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్‌రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 24(సింగిడి):** తెలంగాణ ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం రోడ్లు, భవనాల శాఖలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘంలో సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలపై చర్చించి, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు, వేతన సవరణ సంఘం, ఇతర ఆర్థిక, సర్వీసు ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు స్థిరమైన పెన్షన్, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. పెన్షన్ ఉద్యోగుల సుదీర్ఘ ప్రభుత్వ సేవకు సంబంధించిన సామాజిక భద్రత అని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే సెప్టెంబర్ 1న 'పెన్షన్ విద్రోహ దినం'గా పాటిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల హక్కులు, సర్వీసు సమస్యలు, ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం తెలంగాణ ఎన్జీవోల సంఘం నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి సంఘంలో సభ్యత్వం తీసుకుని ఐక్యతను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, ఉపాధ్యక్షుడు నకీర్తి కరుణాకర్, జిల్లా నాయకులు, ఆర్అండ్‌బీ శాఖ ఉద్యోగులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

### క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 24(సింగిడి ):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 193 దరఖాస్తులు రాగా, అత్యధికంగా నగరపాలక సంస్థకు 58, గృహ నిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత వ్యవస్థలో నమోదు చేయాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారులను సంప్రదించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయండి

### కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వొడితల ప్రణవ్

### సర్‌పై రెండవ విడత ప్రత్యేక శిక్షణ కార్యక్రమం





**జమ్మికుంట ఆగస్టు 24 (సింగిడి):** హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఓటరు, ఓటు ముఖ్యమని, మొదటి విడతలో సర్ ప్రక్రియను విజయవంతం చేసినట్టు రెండో విడతలో కూడా విజయవంతం చేయాలని కరీంనగర్ మాజీ సుడా చైర్మన్, హుజురాబాద్ నియోజకవర్గ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పిలుపునిచ్చారు. సోమవారం రోజున హుజురాబాద్ పట్టణంలో సర్ ఫేజ్ 2 కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని బిఎల్ఏలకు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొదటి విడతలో ప్రతి బిఎల్ఏ బాగా పనిచేశారని, ఓటు నమోదు సవరణలో తప్పులు దొర్లినా, పేరు మార్పునకు అవకాశం ఇచ్చిన సమయాన్ని వినియోగించుకోవాలని, ఇప్పుడు ప్రతి ఓటరును మ్యాపింగ్ చేస్తేనే భవిష్యత్‌లో వారి ఓటును కాపాడిన వారిమవతామని, నియోజకవర్గంలోని బిఎల్ఏలు, కో ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేశారని ఈ సందర్భంగా వారిని అభినందించారు.

**కష్టపడి పనిచేసిన వారికే నామినేటెడ్ పదవులు : ప్రణవ్**

పార్టీకోసం నిరంతరం కష్టపడే వారికి మాత్రమే నామినేటెడ్ పదవులు లభిస్తాయని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. త్వరలో నియోజకవర్గస్థాయిలో ఉన్న అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, జిల్లా అధికార ప్రతినిధులు, కార్యదర్శులు, సర్ కో ఆర్డినేటర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్లు, దేవాలయాల చైర్మెన్ లు, అన్ని మండలాల అధ్యక్షులు, గ్రామాల సర్పంచులు, వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి జన్మదిన వేడుకలు

### ఉద్యోగులు, యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు 24(సింగిడి):** ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం జన్మదిన వేడుకలు సోమవారం కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. కరీంనగర్-2 డిపో వద్ద ఉద్యోగులు మల్లేశంతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 19వ డివిజన్‌లో యూత్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మల్లేశంకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రీజియన్ అధ్యక్షుడు ఎన్.కె. రాజు, కార్యదర్శి టీ.ఆర్. రెడ్డి, కోశాధికారి శేఖర్, సంయుక్త కార్యదర్శి రజనీకుమార్, జోనల్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, శ్రీధర్, డిపో కార్యదర్శి రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీని తనిఖీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్



**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 24 (సింగిడి):** నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఏసీ గార్డ్స్, సీఐబీ క్వార్టర్స్ వద్ద ఉన్న పోలింగ్ స్టేషన్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నోటీసుల పంపిణీ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో ఆయన ప్రత్యక్షంగా సమీక్షించారు. బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓ, ఈఆర్ఓలతో సమావేశమై, ఓటర్లకు ఎస్ఐఆర్ నోటీసులు క్రమబద్ధంగా అందేలా తగు సూచనలు జారీ చేశారు. నోటీసుల ముఖ్య ఉద్దేశ్యాన్ని ఓటర్లకు స్పష్టంగా వివరించి, ఆ ప్రక్రియను పూర్తి చేయడంలో వారికి పూర్తి సహాయసహకారాలు అందించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. స్థానికులతో స్వయంగా మాట్లాడి ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను వారికి వివరించారు. నోటీసులోని వివరాలను సరిచూసుకొని, నిర్దేశిత గడువులోగా అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. ఫారాలు, సహాయక పత్రాల సమర్పణకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే, వెంటనే సంబంధిత బీఎల్ఓను సంప్రదించాలని ఓటర్లకు సూచించారు. ఎన్నికల సిబ్బంది పరస్పర సమన్వయంతో ప్రజల సందేహాలను సత్వరమే నివృత్తి చేయాలని, అర్హులైన పౌరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విధాలా సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ నొక్కి చెప్పారు.

# వైభవంగా కలిదిండి సత్తెమ్మ తల్లి దేవాలయ శంకుస్థాపన



**కూకట్‌పల్లి, ఆగస్టు 24 (సింగిడి):** కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో శ్రీ కలిదిండి సత్తెమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని స్థానికుల భాగస్వామ్యంతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవాలయ నిర్మాణ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాల నిర్మాణం జరగడం ఎంతో సంతోషకరమని అన్నారు. శ్రీ సత్తెమ్మ తల్లి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, పరిపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ రావు, తదితర ప్రముఖులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు.

## గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

### మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయం

### మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్



**జమ్మికుంట ఆగస్టు 24 (సింగిడి):** జమ్మికుంట మున్సిపాలిటీలో పని చేస్తున్న మహిళా పారిశుద్ధ కార్మికులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, సమాజ సేవలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్స్ శీలం శ్రీనివాస్ కొలుగూరి సురేష్ పరశురాం సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ తోపాటు ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని యాచకుడు మృతి



**జమ్మికుంట ఆగస్టు 24 (సింగిడి):** జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి ముస్లిం కమ్యూనిటీ కి చెందినవాడిగా ఉన్నాడని అతని ఎడమ చేతికి అనే అక్షరాలు పచ్చబొట్టు ఉన్నాయని జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే జమ్మికుంట పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కోరపల్లి సర్పంచ్ అందించిన సమాచారం మేరకు జమ్మికుంట పోలీసులు కోరపల్లి గ్రామానికి చేరుకొని మృతుడిని అంబులెన్స్ ద్వారా జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సమాచారం అందిన వెంటనే స్పందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు సహకరించిన అంబులెన్స్ శేఖర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## భూ వివాదం కేసులో ఐదుగురికి ఐదేళ్ల జైలు



**జమ్మికుంట ఆగస్టు 24 (సింగిడి):** ఇల్లందకుంట మండలం గడ్డివాని పల్లిలో 2019లో జరిగిన భూ వివాదం కేసులో హుజూరాబాద్ కోర్టు సోమ వారం తీర్పు వెలువరించింది. గడ్డి వానిపల్లికి చెందిన ఎలవేని రఘుపతి 35 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 18 గుంటల భూమిని తమ తండ్రి తమకు తెలియకుండా విక్రయించారంటూ రఘుపతిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన గడ్డి మహేష్ (ఉపసర్పంచ్), గడ్డి కొమురయ్య, గడ్డి రాజు, గడ్డి తిరుపతితో పాటు సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేని ఎర్రయ్య చేసిన భౌతిక దాడిలో తీవ్రంగా గాయపడిన రఘుపతిని కుటుంబ సభ్యులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఎంజీఎంకు తరలించారు. రఘుపతి కూతురు ఫిర్యాదుతో ఇల్లందకుంట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరేళ్ల విచారణ అనంతరం కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కేసులో కోర్టు వాయిదాలకు ఇరువర్గాలను హాజరుపరచడంలో విధులు నిర్వహించిన కోర్టు కానిస్టేబుల్ జన్నే రాజేష్‌ను హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ వెంకట్‌గౌడ్, ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్ అభినందించారు.

# రూ.10 కోట్లతో త్వరలో లైబ్రరీ పనులకు శంకుస్థాపన

- ఆగస్టు 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి లక్ష్యం
- రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 24(సింగిడి):** నల్లగొండలో త్వరలోనే 10 కోట్లతో లైబ్రరీ పనులకు శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ క్లబ్‌లో రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన గెస్ట్ రూమ్, కాన్ఫరెన్స్ హాల్‌ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండ క్లబ్‌లో మంచి వాతావరణం ఉందని, పట్టణ ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. క్లబ్‌కు సమీపంలోని ఎకరం స్థలాన్ని సమకూర్చేందుకు కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీ పనుల్లో పురోగతిఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేయడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులు సమకూర్చుకుని పనులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఆగస్టు 2028 నాటికి సొరంగ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. గతంలో రూ. 2 వేల కోట్లుగా ఉన్న ఎస్ఎల్‌బీసీ అంచనా వ్యయం ప్రస్తుతం రూ. 5 వేల కోట్లకు పెరిగిందని, పనుల్లో ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 1,300 కోట్లతో హ్యామ్ రోడ్ల పనులు చేపడుతున్నామని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ. 2,500 కోట్లతో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. విద్యకు ప్రాధాన్యతనల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ పాఠశాల నిర్మాణానికి రూ. 12 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పాత టౌన్‌లో రూ. 10 కోట్లతో త్వరలో లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. లైబ్రరీలో విద్యార్థులకు కోచింగ్, ఫౌండేషన్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నల్లగొండ పట్టణం, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని ప్రాధాన్యతతో చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోలి అమరేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, గుమ్మల జానకిరెడ్డి, క్లబ్ సెక్రటరీ చల్ల వెంకటరమణ, కాసర్ల వెంకటరెడ్డి, క్లబ్ సభ్యులు డాక్టర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఏఈఓ అన్వేష్, సర్వేయర్ తేజవత్ గణేష్‌నాయక్




**డోర్నకల్ /మరిపెడ, ఆగస్టు 24 (సింగిడి):** డిజిటల్ క్రాప్ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తానంచర్ల రెవెన్యూ గ్రామ ఏ ఈ ఓ అన్వేష్, డిజిటల్ క్రాప్ సర్వేయర్ తేజావత్ గణేష్ నాయక్ తెలిపారు. సోమవారం 24/08/2026 నుండి తానంచర్ల రెవెన్యూ గ్రామంలోని కొట్య తండా, వాల్య తండా, అజ్మీరా తండా, మూలమర్రి తండా, డిఎస్ఆర్ జండల తండాలలో సుమారు 4600 సర్వే నెంబర్లు ఉన్నాయి. ఈ నెంబర్లకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్నాము, ఈ సర్వే ను రైతులందరూ సద్వినియోగం చేసుకొని పంటలను సర్వే చేసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుండి మెరుగైన సేవలను రైతులకు అందించడం జరుగుతుందని, పంటలను అమ్ముకోవడానికి కూడా సులభతరం అవుతుందన్నారు. అలాగే ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు నేరుగా రైతులకు అందుతాయన్నారు.

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల ప్రతీక బోనాలు



- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ ఆగస్టు 24(సింగిడి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక బోనాల పండుగని మిర్యాలగూడ శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారంమిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా కలగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మన ఆచార వ్యవహారాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో యాద్గార్పల్లి సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి నిరంజన్ రెడ్డి, నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాలకీడులో సోమవారం ప్రజావాణి



**కోదాడ, ఆగస్టు 24(సింగిడి):** పాలకీడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి, ప్రజావాణి నోడల్ అధికారి జీ. లక్ష్మి తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరై, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

# బోనమెత్తిన కోదాడ : ముత్యాలమ్మకు భక్తుల బోనాల సమర్పణ







- బోనం ఎత్తి మొక్కు చెల్లించిన
- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి
- అమ్మవారిని దర్శించుకున్న బొల్లం దంపతులు

**కోదాడ, ఆగస్టు 24(సింగిడి):** కోదాడ పట్టణంలో ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉదయం నుంచే పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు బోనాలతో ఆలయానికి తరలిరావడంతో ప్రధాన వీధులు పండుగ కళను సంతరించుకున్నాయి. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి బోనం ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ముత్యాలమ్మ తల్లిని ప్రార్థించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఇందిరా దంపతులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, గ్రామాలు, పట్టణం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. బోనాల సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, భక్తుల నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పలువురు భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారిందిఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ పరిసరాల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్--ఇందిరా దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్‌పర్సన్ మల్లీశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "వరుణ యాగం"



**మిర్యాలగూడ, ఆగస్టు 24(సింగిడి):** మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24 శ్రావణమాసం రెండవ సోమవారం ఉదయం 9:00 గంటలకు మిర్యాల పట్టణంలోని మెయిన్ బజార్ లో గల శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయం (శివాలయం)లో సహస్ర ఘటాభిషేకం (వరుణ యాగం)నిర్వహిస్తున్నామని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోళ్ళ రామశేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ చౌదరి (బాబి) కార్యదర్శి పోలిశెట్టి ధనుంజయ కోశాధికారి గందె రాము లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రమంతా వర్షాలు లేక కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయని, వర్షాలు నీరు లేక పంట పొలాలు సైతం నీళ్లు దొరకక కరువు పరిస్థితిలో ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు పుష్కలంగా పండాలని, త్రాగు,సాగు నీరు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు "వరుణ యాగం" రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 24 (సోమవారం) ఉదయం 9-00 గంటల నుండి వేదపండితులచే విరాఠ పర్వం, వరుణ హోమం, రుద్ర హోమం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు వరుణ యాగం పూజా కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ బండారు కుశలయ్య మాట్లాడుతూ వరుణ యాగం కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

## సర్పంచ్ కుటుంబానికి అండగా నిలిచిన నెహ్రూ నాయక్..



**డోర్నకల్ /మరిపెడ, ఆగస్టు 24(సింగిడి):** మరిపెడ మండలం వెంకంపాడ్ గ్రామ సర్పంచ్ ఉప్పల సొమ్మన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని, ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తు గురించి ఆరా తీసి, వారి చదువు మరియు భవిష్యత్తుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం, బాధితుల కన్నీళ్లు తుడవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఉప్పల సొమ్మన కుటుంబానికి ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుంది. వారి పిల్లల భవిష్యత్తుకు అవసరమైన సహాయం అందిస్తాను"అని మాలోత్ నెహ్రూ నాయక్ భరోసా ఇచ్చారు. వారి వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

# దేశానికి వెన్నెముక రైతే..

- విద్యార్థులకు ఆహారం ప్రాధాన్యత తెలవడానికి కొత్త రకం ఆలోచన
- వ్యవసాయ ప్రాముఖ్యత రైతుల కష్టనష్టాలు వారి విలువ తెలువడం కోసమే ఈ కార్యక్రమం
- విజ్ డమ్ హైస్కూల్, నర్సంపేట విద్యార్థులచే వ్యవసాయ క్షేత్రాల సందర్శన



**నర్సంపేట, ఆగస్టు 24(సింగిడి):** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని విజ్ డమ్ హై స్కూల్ కు చెందిన విద్యార్థులచే వ్యవసాయ క్షేత్రాల సందర్శన జరిగిందని పాఠశాల కరస్పాండెంట్,డైరెక్టర్ జహంగీర్,జావీద్ లో తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు తమ విషయోపాధ్యాయులు వరి పండించే విధానం సవివరంగా వివరించడం జరిగింది. తరగతి గదిలో బోధనే కాకుండా, బయటి వాతావరణం, ప్రకృతి సమాజం ద్వారా నేర్చుకునే విధానం విద్యార్థులలో సృజనాత్మకతను అనుభవ పూర్వక అభ్యాసాన్ని మరియు ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపకరిస్తుందని తెలియజేయడం జరిగింది. వ్యవసాయ ప్రాముఖ్యత దానివల్ల రైతుల కష్టనష్టాలు వారి కష్టం యొక్క విలువ, ప్రజల కోసం ఆహారాన్ని అందించడానికి వారు పడే తపన, కష్టనష్టాలకు ఓర్చి తమ పిల్లలకు భావి జీవితాన్ని అందించాలనే పట్టుదల రైతులతో పాటు తమ తల్లిదండ్రుల్లో కనబడుతుందని వారు తెలిపారు. రైతే దేశానికి వెన్నెముక అనే నానుడి నిజమని ఆహారం యొక్క ప్రాధాన్యత తెలియజేయడం కొరకు అవగాహన చేయడం జరిగింది. విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ద్వారా నేరుగా తాము వరి నాట్లు వేయడం తదితర వ్యవసాయ పనులు ప్రత్యక్షంగా చేయడం ఎంతో మధురానుభూతిని మిగిల్చడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విషయోపాధ్యాయులు రవీందర్, సుకన్య, హారిక, మానస, రమేష్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

## బీసీ బాలికల గురుకుల పాఠశాలలో పని మనుషులుగా మారిన విద్యార్థినిలు

- ఆర్ సి ఓ , ప్రిన్సిపాల్‌లు తమ పిల్లలతో చపాతీలు చేయిస్తారా
- మూడవత్ జగన్‌నాయక్



**మిర్యాలగూడ, ఆగస్టు 24(సింగిడి):** ప్రభుత్వ గురుకులాల్లో పిల్లల్ని పని మనుషులుగా చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మూడవ జగన్ నాయక్ అన్నారు. ఆదివారంశ్రీనివాస్ నగర్ లో దామరచర్ల బిసి బాలికల గురుకుల పాఠశాలల ను సందర్శించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ బిసి బాలికల గురుకుల పాఠశాల గేటు వద్ద కు పోయే సరికి టేబుల్ బయట వేసి సుమారు 30మంది విద్యార్థినీ లతో చాపాతీలు చేయించడం జరిగింది. బిసి విద్యార్థిని లు ఉన్నత చదువులకు కోసం తల్లిదండ్రులు గురుకుల పాఠశాల లో వుంచి చదివిస్తుంటే . మా పిల్లలు గురుకుల పాఠశాలలో బాగా చుదువుకుంటున్నారని అనుకుంటున్నా విద్యార్థులు తల్లి దండ్రులు ఒక్కసారి గా షాక్ అయ్యారు . ప్రతి ఆదివారం ఒక్కోక్క తరగతి విద్యార్థులు పూరిలకోసం చపాతి లు చేయాల్సిందే . అంటే ఆ బిసి బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు సరిపడా పూరిలు చేయాలి. బిసి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,బిసి గురుకులాల పిల్లలు అయితే ఇలానే చపాతిలు చేయిస్తారా అని డిమాండ్ చేయడం జరిగినది. చదువుకోవడానికి వచ్చిన విద్యార్థుల నూ హోటల్ లో పనిచేసే మాదిరి గా మార్చడం దుర్మార్గం అని తక్షణమే నల్లగొండ జిల్లా కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఈ గురుకుల పాఠశాలలో ఏదో ఒక సమస్యతో పత్రిక లలో వస్తున్న బిసి గురుకులాల సెక్రేటరీకీ , జిల్లా ఆర్ సి ఓ కి విద్యార్థులు పట్ల వున్న చిత్త శుద్ధి అర్థం అవుతుందని అన్నారు. నాగార్జున కళాశాలలో వున్న బిసి బాలుర గురుకుల పాఠశాలలో ఆగష్టు 15కు లడ్డు ఇచ్చారని ఈరోజు విద్యార్థులకు ఉదయం టిఫిన్ పూరి బంద్ చేయడం జరిగింది విద్యార్థులకు ఎందుకు పూరి పెట్టలేదని అడిగితే మెస్ ఛార్జీలు సరిపోవడం లేదనిచెప్పితే ఈ ఆదివారం ఉదయం టిఫిన్ పూరి బంద్ చేయండి అని చెప్పారని చెప్పడం బాధాకరం అని అన్నారు. నల్లగొండ జిల్లా లో బిసి గురుకులాల్లో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా బిసి గురుకులాల ఆర్ సి ఓ ను వేంటనే తొలగించాలని లేని పక్షంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బలమైన సమరశీల పోరాటాలకు పిలుపునివ్వడం జరుగుతుందని హెచ్చరించారు.

## రైస్ మిల్లుల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాం

రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజయ్య



**మిర్యాలగూడ, ఆగస్టు 24(సింగిడి):** రైస్ మిల్లుల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బి ఆర్ టి యు నిరంతరం పోరాడుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు దుండిగల్ అంజయ్య అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్‌టీయూ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 31 మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులకు జీతాలు, బోనస్‌లు పెంచడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాల కల్పనకు సంఘం కృషి చేస్తోందని తెలిపారు. బీఆర్‌టీయూ పట్టణ అధ్యక్షులు ఐల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా పనిచేసి తమ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. పట్టణంలోని రైస్ మిల్ డ్రైవర్లకు ఎలాంటి సమస్య వచ్చినా బీఆర్‌టీయూ కార్మిక సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా నల్లమోతు సిద్ధార్థ, అధ్యక్షులుగా పట్టం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ పాషా, కోశాధికారిగా వెలగపూడి వెంకటరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కులుకుల దశరథ, జమ్మి గుంపుల సుధాకర్, భీమిరెడ్డి వెంకటరెడ్డి; సహాయ కార్యదర్శులుగా ఎస్కే గౌస్, ఎం. భూపతిరావు, జి. ఈశ్వరరావు; ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కులుకుల సైదులు, భారీ అశోక్, ఎం. నాగరాజు, పులి కరుణాకర్, కంపసాటి నాగరాజు ఎన్నికయ్యారు.


## చిన్నారి కశ్వికకు మాలోత్ నెహ్రూ నాయక్ ఆపన్నహస్తం...

పాప ఆరోగ్య పరిస్థితి విని చలించి.. వైద్య ఖర్చులకు రూ.50 వేల సాయం



**డోర్నకల్ /మరిపెడ, ఆగస్టు 24(సింగిడి):** చిన్నారి కశ్విక వైద్య చికిత్సకు ఆర్థిక సాయం ఆదివారం అందించి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాలోత్ నెహ్రూ నాయక్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన చిన్నారి కశ్విక బోన్ మ్యారోకు సంబంధించిన జన్యుపరమైన తీవ్రమైన వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి వైద్యానికి సుమారు రూ. 50 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు చిన్నారి తండ్రి కంపాటి రవీందర్ తెలిపారు. ఈ విషయమై చిన్నారి తండ్రి రవీందర్. పాప ఆరోగ్య పరిస్థితి, వైద్య చికిత్సకు అవుతున్న ఖర్చులు, కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను నెహ్రూ నాయక్‌కు వివరించారు. చిన్నారి పరిస్థితిని పూర్తిగా విన్న నెహ్రూ నాయక్ తీవ్రంగా చలించిపోయారు. పాపకు మెరుగైన వైద్యం అందించేందుకు తనవంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో వెంటనే స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చిన్నారి కశ్విక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన నెహ్రూ నాయక్.. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పాప వైద్యానికి భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో మానవతావాదులు, దాతలు ముందుకొచ్చి తమవంతు సహాయం అందించాలని కోరారు. ఆపదలో ఉన్న చిన్నారి పరిస్థితిని విని వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన నెహ్రూ నాయక్‌ను పలువురు అభినందించారు.. ఇంకా మనసున్న దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వేడుకుంటున్నారు ఫోన్ పే నెంబర్ 7989768368.. ఈ కార్యక్రమంలో అనంతుల ఉపేందర్ గౌడ్, మంద ప్రకాష్, సక్రం, సతీష్, జానీ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# తీపి తగ్గే....భారం పెరిగే... సామాన్యుడిపై చెక్కర దెబ్బ...!!




**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 24(సింగిడి):** పేద మధ్య తరగతి ప్రజలు అతిగా ఉపయోగించే వంటింటి నిత్యవసర వస్తువుల్లో చక్కెర ప్రధానంగా ఉంటుంది. బంధువులు వచ్చినా స్నేహితులు కలిసిన టీ కాఫీ తోనే దినచర్య మొదలవుతుంది. అలాంటి చెక్కర సామాన్యులకు ధరల భారం పెరగడం తో తీపి తగ్గి... చేదు పెరిగి... ధరల భారం సామాన్యుడిపై నెలసరి నిత్యవసర కోటాలో చుక్కలు చూపిస్తున్నాయి. సామాన్యుడు నిత్యవసర వస్తువులు ఉప్పు, పప్పు, కారం వంట నూనెలు, బియ్యం ధరల భారం ఇప్పటికే నడ్డి విరుస్తుంటే.... ఇప్పుడు చక్కెర ధరలు కూడా మంట పుట్టిస్తున్నాయి. మధ్యతరగతి కుటుంబాల నెలవారి బడ్జెట్లో తీపి తగ్గించి జీవితంలో చేదు నింపుతుంది. అసలే పండుగల మాసం బహిరంగ మార్కెట్లో కిలో చక్కెర 45 రూపాయలు ఉన్న చక్కెర ధర 80 పలుకుతుండటం తో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పండుగల సీజన్ దగ్గర పడుతున్న వేళ ఈ తరహా ధరలు పెరుగుదల సగటు గృహిణి పెద్ద సవాల్ గా మారింది. వర్షాభావం పరిస్థితులు చెరుకు దిగుబడి తగ్గడం ఈ ఆకస్మాత్తుగా ధరలు పెరగడం ప్రధాన కారణం. చక్కెర ధరలు గ్రామస్థాయి నుండి పార్లమెంటు స్థాయి వరకు అధికార ప్రతిపక్ష పార్టీలలో దేశంలో రాజకీయ అంశంగా కాక పుట్టిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా చక్కెర ఉత్పత్తి తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్లను తీవ్ర కొరత ప్రభావం ఏర్పడింది. సామాన్య కుటుంబాలే కాకుండా హోటల్స్ , స్వీట్ షాపులు, బేకరీ యజమానులు పెరిగిన ధరల వినియోగదారుల పైనే మోపుతున్నారు. శుభకార్యాలు చేసుకునే వారికి ఈ చక్కెర ధర మంటలు అదనం భారంగా మారింది. టీ కాఫీ నుంచి మొదలుకొని నిత్యం చేసుకునే పిండి వంటల వరకు ప్రధాన ధరల వేడి తగులుతోంది. గతంలో పేద ప్రజలకు నెలవారి రేషన్ కోటాలో చెక్కరను అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.. పెరిగిన రవాణా ఖర్చులు డీజిల్ ధరలు కూడా చక్కెర రిటైల్ ధర పెరగడానికి మరో కారణం ఒకవైపు ఆదాయాలు పెరగక, మరోవైపు అన్ని నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుడు జీవనం తలకిందులు అవుతుంది. పాలు, టీ, కాఫీ, గ్యాస్ పెరిగిన ధరలకు ఇప్పుడు చెక్కర ధరలు కూడా తోడవడంతో సామాన్యుకి ఖరీదుగా మారింది. చక్ర పరిశ్రమ లభించే సబ్సిడీలు లేదా మద్దతు సగటు వినియోగదారుడు ఏమాత్రం ఉపశమనం కలిగించడం లేదు. పేద ప్రజలకు ఊరట ఇచ్చేందుకు రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే చక్కర కోటాను ప్రభుత్వం పునరుద్ధరించాలని దిగుమతులపై స్పష్టమైన విధానం అమలు చేస్తూ ప్రజల అవసరాల కోసం చక్కెర ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేకుంటే రాబోయే రోజులలో పండుగల సంతోషం ఆవిరయ్యే విధంగా ఉందని ఇప్పటికైనా సామాన్యుడి బతుకుల లో తీపి నింపేల ధరలు అదుపులోకి తీసుకోచ్చి పేద ప్రజలకు సబ్సిడీ పై చక్కెర అందివ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇక ఏ టిఫిన్ అక్కర్లేదు.. జస్ట్ 10 నిమిషాల్లోనే సూపర్‌ఫుడ్..

**ఆరోగ్యకరమైన మల్టీ గ్రైన్ జావా లేదా అంబలి అనేది సంప్రదాయమైన, పోషక విలువలు పుష్కలంగా ఉన్న పానీయం.. రోజువారీ ఆహారంలో దీనిని చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలను, ముఖ్యంగా ఇనుము, కాల్షియంను అందించవచ్చు.**





చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంతో మేలు చేసే ఈ జావను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. దీంతో పాటు.. ఎండాకాలం ఈ జావ శరీరాన్ని చల్లగా ఉండేలా చేస్తుంది. అద్భుతమైన విటమిన్లు, ఖనిజాలు కలిగిన ఈ రెసిపీని ఇంట్లో జస్ట్ 10 నిమిషాల్లో తయారు చేసుకోవచ్చు.. దీని తయారీలో రెండు ప్రధాన దశలు ఉంటాయి.. మల్టీ గ్రైన్ పిండి తయారీ, జావా తయారీ.

మల్టీ గ్రైన్ పిండిని తయారుచేయడానికి, ముందుగా నాణ్యమైన ధాన్యాలను ఎంచుకోవాలి. ఈ మిశ్రమంలో రాగులు 1 నెస్త్ర, సజ్జలు 1/4 నెస్త్ర, ఓట్స్ 100 గ్రాములు, జొన్నలు 1/4 నెస్త్ర, బార్లీ 1/4 నెస్త్ర వంటి వాటిని ఉపయోగించవచ్చు. ఈ ధాన్యాలన్నీ విడివిడిగా తీసుకోవాలి. ప్రతి ధాన్యాన్ని ఒక డ్రై పాన్‌లో వేసి, అది కమ్మటి వాసన వచ్చేవరకు, సుమారు ఐదు నుండి ఏడు నిమిషాల పాటు తక్కువ మంట పై వేయించుకోవాలి. వేయించిన తర్వాత, వాటిని పూర్తిగా చల్లారనివ్వాలి. తరువాత, ఈ వేయించిన ధాన్యాలను మిల్లులో లేదా ఇంట్లో గ్రైండర్ ఉపయోగించి మెత్తటి పొడిలాగా తయారు చేసుకోవాలి. ఈ పొడిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు. ఇది చాలా రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఈ పిండిని ఒకసారి సిద్ధం చేసుకుంటే, జావాను ఎప్పుడంటే అప్పుడు సులభంగా తయారు చేసుకోవచ్చు.

జావా తయారీ కోసం, ముందుగా స్టవ్ వెలిగించి, ఒక మూకుడు లేదా గిన్నెను పెట్టి, అందులో తగినంత నీటిని వేసుకోవాలి. ఉదాహరణకు, మూడు కప్పుల జావ కోసం, మూడు కప్పుల నీటిని తీసుకోవచ్చు. నీరు బాగా మరుగుతున్నప్పుడు, మరో కప్పులో మూడు స్పూన్ల మల్టీ గ్రైన్ పిండిని తీసుకుని, కొద్దిగా నీటిని కలిపి ఉండలు లేకుండా మెత్తటి పేస్ట్ లాగా తయారు చేసుకోవాలి. ఈ విధంగా పేస్ట్ తయారు చేసుకోవడం వల్ల జావా వండేటప్పుడు ఉండలు కట్టకుండా ఉంటుంది.

నీరు మరుగుతున్నప్పుడు, దానికి రుచికి సరిపడినంత ఉప్పును చేర్చాలి. ఆ తర్వాత, ముందుగా సిద్ధం చేసుకున్న మల్టీ గ్రైన్ పిండి పేస్ట్‌ను మరుగుతున్న నీటిలో నెమ్మదిగా కలుపుతూ ఉండాలి. దీన్ని సుమారు పది నిమిషాల పాటు చిన్న మంటపై బాగా మరిగించాలి. ఈ పది నిమిషాల మరుగుదల వల్ల ధాన్యాలు చక్కగా ఉడికి, జావా చిక్కబడి, మంచి రుచి వస్తుంది. ఉడికిన తర్వాత స్టవ్ ఆపి, జావాను చల్లారనివ్వాలి. జావా చల్లారే సమయంలో, గరిటెతో అప్పుడప్పుడు తిప్పుతూ ఉండాలి. ఇలా చేయడం వల్ల పైన మీగడ కట్టకుండా జావా ఏకరీతిగా ఉంటుంది. జావా పూర్తిగా చల్లారిన తర్వాత, ఒక గ్లాస్ తాజా మజ్జిగను కలుపుకోవాలి. మజ్జిగ కలపడం వల్ల జావా రుచి మరింత పెరుగుతుంది. వేసవిలో శరీరానికి చలువ చేస్తుంది. ఇలా తయారుచేసుకున్న మల్టీ గ్రైన్ జావా ఎంతో ఆరోగ్యకరమైనది, పోషకమైనది.. రుచికరమైనది. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

### ఉదయం లేవగానే
## చేయకూడని తప్పులు.. !

మనం ఉదయం నిద్ర లేచిన మొదటిగంటలో చేసేపనులు మన రోజంతా ఎలా ఉంటుందో నిర్ణయిస్తాయి. అయితే, తెలియకుం డానే మనం చేసే కొన్ని తప్పులు మనఆరోగ్యాన్ని,పనిసామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మన రోజంతాఉత్సాహంగా,ఆరోగ్యంగా సాగాలంటే ఉదయాన్నే చేసే కొన్ని అలవాట్లను వెంటనే మానుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మనం చేసే చిన్నచిన్న పొరపాట్లు మన మాన సిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావంచూపుతాయి. అలాంటి తప్పులేంటో తప్పక తెలుసుకోవాలి..దీనికి సంబంధించిన పూర్తి వివరాలు:

**వెంటనే మానుకోవాల్సిన 5 అలవాట్లు:**

**నిద్రలేవగానే స్మార్ట్‌ఫోన్ చూడటం:**
చాలామందికళ్లు తెరవగానే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ నోటిఫికేషన్లు చూస్తుంటారు. ఇది మెదడును వెంటనే ఒత్తిడికి గురిచేస్తుంది. దీనివల్ల రోజంతా ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. కనీసం నిద్రలేచిన అరగంట వరకు ఫోన్ ముట్టుకోకపోవడం ఉత్తమం.

**ఖాళీ కడుపుతో కాఫీ/టీ తాగడం:**
బెడ్ కాఫీ తాగడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి. పాలలో ఉండే కెఫీన్ ఖాళీ కడుపులో యాసిడ్స్ ఉత్పత్తిని పెంచుతుంది. దీనికి బదులుగా గోరువెచ్చని నీరు లేదా నిమ్మరసం తాగడం వల్ల శరీరం లోపల శుభ్రపడుతుంది.

**అలారం స్నూజ్ చేయడం:**
మరో 5నిమిషాలు పడుకుందాం అని స్నూజ్ బటన్ నొక్కడం వల్ల గాఢ నిద్రకు అంతరాయం కలుగుతుంది. దీనివల్ల మెదడు గందరగోళానికి గురై, రోజంతా మగతగాం) ఉంటుంది.

**అల్పాహారం మానేయడం:**
ఉదయం పూట సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీనివల్ల నీరసం, చిరాకు మరియు పనిలో ఏకాగ్రత లోపిస్తుంది. ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం చాలా అవసరం.

**నీరు తాగకపోవడం:**
సుమారు 7-8 గంటల నిద్ర తర్వాత మన శరీరం నీటిని కోరుకుంటుంది. ఉదయాన్నే నీరు తాగకపోతే జీవక్రియ మందగిస్తుంది. లేవగానే ఒక గ్లాసు నీరు తాగడం వల్ల మెదడు చురుగ్గా మారుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి అనేది మనం చేసే చిన్న మార్పులతోనే మొదలవుతుంది. ఈ పొరపాట్లను సరిదిద్దుకుని, ఉదయాన్నే వ్యాయామం లేదా ధ్యానం అలవాటు చేసుకుంటే మీ జీవితంలో సానుకూల మార్పులు వస్తాయి.

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం

**తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు. బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు.**



బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు.

జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు.

తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తినీ దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది.

ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.

వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించుకున్నారు.

ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్థిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రిలోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు. ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు... ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్థిని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి.

ఆయన 130కి పైగా గ్రంధాలు రాసాడు. అన్ని గ్రంధాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు.

వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.



**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# ఫ్రిజ్‌లో ఉన్నా ఆహారం పాడవుతోందా?

**వేసవిలో వంటకాలు తాజాగా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి**

సాధారణంగా వేసవి కాలంలో వాతావరణంలోని వేడి వల్ల ఆహారంలోని కొవ్వులు విచ్ఛిన్నమై దుర్వాసన వస్తుంటాయి. ముఖ్యంగా పాలు, పప్పులు ఇంకా మాంసం వంటి ప్రోటీన్ అధికంగా ఉండే పదార్థాలపై బ్యాక్టీరియా ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది.

ఆహారాన్ని ఎక్కువ సేపు బయట ఉంచి ఆ తర్వాత ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల కూడా అది త్వరగా పాడవుతుంది. అందుకే రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 1 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉండేలా చూసుకోవాలి. వండిన ఆహారాన్ని రెండు గంటలలోపు ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది. అయితే వేడి వేడి పదార్థాలను నేరుగా ఫ్రిజ్‌లో పెట్టకుండా గది ఉష్ణోగ్రతకు వచ్చే వరకు చల్లారనివ్వాలి. లేదంటే ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రత పెరిగి ఇతర వస్తువులు కూడా పాడయ్యే అవకాశం ఉంది.

**ఫ్రిజ్‌లో వద్దు..**

చాలామంది చేసే పొరపాటు ఏంటంటే.. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు ఇంకా వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెట్టడం. నిజానికి వీటిని ఫ్రిజ్‌లో పెడితే తేమ వల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. వీటిని ఎప్పుడూ గాలి తగిలే పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. అలాగే ఫ్రిజ్‌ను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం చాలా అవసరం. మురికిగా ఉన్న ఫ్రిజ్ బ్యాక్టీరియా వృద్ధికి కేంద్రంగా మారుతుంది. ఆహారాన్ని నిల్వ చేసేటప్పుడు ఎప్పుడూ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. పాత ఆహార పదార్థాలను కొత్తగా వండిన వాటితో కలపడం వల్ల కూడా ఇన్ఫెక్షన్లు త్వరగా వ్యాపిస్తాయి. కాబట్టి తాజాగా ఉన్నవాటిని విడిగా ఉంచడమే క్షేమం.

పండ్లు ఇంకా కూరగాయల విషయంలో జాగ్రత్తలు అవసరం. ఆకుకూరలను కడిగి బాగా ఆరబెట్టిన తర్వాత పేపర్ టవల్‌లో చుట్టి నిల్వ చేస్తే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కోసిన పండ్లను వెంటనే తినేయాలి లేదా గాలి చొరబడని డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇక మాంసాహారం విషయానికి వస్తే మాంసం, చేపలు ఇంకా గుడ్లను ఇతర వంటకాలతో కలవకుండా విడివిడిగా భద్రపరచాలి. వేసవిలో వండని మాంసం నుండి వెలువడే బ్యాక్టీరియా వండిన పదార్థాలకు సోకకుండా చూసుకోవడం అత్యంత కీలకం. ఇది ఆహారం కలుషితం కాకుండా కాపాడుతుంది.

**పదేపదే వేడి చేయొద్దు..**

ఆహారాన్ని పదేపదే వేడి చేసే అలవాటును మానుకోవాలి. ఒకటి కంటే ఎక్కువసార్లు వేడి చేయడం వల్ల ఆహారం యొక్క నాణ్యత ఇంకా భద్రత రెండూ దెబ్బతింటాయి. వంట చేయడానికి ఇంకా వడ్డించడానికి ఎప్పుడూ శుభ్రమైన పాత్రలను మాత్రమే వాడాలి. చేతులు కూడా శుభ్రంగా కడుక్కోవడం వల్ల బ్యాక్టీరియా వ్యాప్తిని అరికట్టవచ్చు. వేసవిలో ఆహారం పట్ల తీసుకునే ఇటువంటి చిన్న చిన్న జాగ్రత్తలు మనల్ని పెద్ద ఆరోగ్య సమస్యల నుండి రక్షిస్తాయి. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహారాన్ని పద్ధతి ప్రకారం నిల్వ చేసి తీసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా గడపవచ్చు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని గుర్తించి మెలిగితే ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావు.



స్టాక్ మార్కెట్ Stock Market

# అనిశ్చితి వేళ.. పసిడిలోకి భారీ పెట్టుబడులు



దిల్లీ: ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో పసిడి ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు)లోకి రూ.31,561 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు ఆరు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పెట్టుబడిదార్లు మొగ్గుచూపారు. త్రైమాసికం వారీగా చూస్తే.. పెట్టుబడులు 36% పెరిగి రూ.23,132 కోట్లకు చేరాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) గణాంకాల ప్రకారం.. 2025 జనవరి-మార్చిలో రూ.5654 కోట్ల పెట్టుబడులు రాగా, ఈ ఏడాది రూ.31,561 కోట్లుగా నమోదయ్యాయి. జనవరిలో రూ.24,040 కోట్లు, ఫిబ్రవరిలో రూ.5,255 కోట్లు, మార్చిలో రూ.2,266 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి. జనవరితో పోలిస్తే మార్చిలో పెట్టుబడుల వేగం తగ్గింది. ఈక్విటీ మార్కెట్లపై మదుపర్లు ఆసక్తి చూపడం, పసిడి ధరల పెరుగుదల వల్ల కొత్త పెట్టుబడులు కొంత నెమ్మదించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

పసిడి ఫండ్ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ గత ఏడాది రూ.58,888 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అవి మూడు రెట్లు పెరిగి రూ.1.71 లక్షల కోట్లుగా ఉన్నాయి. పసిడి ఈటీఎఫ్‌ల్లో ఫోలియోల సంఖ్య 69.69 లక్షల నుంచి 1.24 కోట్లకు పెరిగింది. బంగారంపై సాధారణ మదుపర్లకు పెరుగుతున్న ఆసక్తిని ఇది సూచిస్తోంది.
నగలు, నాణేల రూపంలో భౌతికంగా బంగారాన్ని కొనుగోలు చేయడం కంటే ఈటీఎఫ్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టడం సులభం. ఇవి పారదర్శకంగా ఉండటంతో పాటు సులభంగా విక్రయించొచ్చు అని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మేష్రామ్ తెలిపారు. మార్కెట్ అస్థిరంగా ఉన్నప్పుడు పోర్ట్‌ఫోలియోను బ్యాలెన్స్ చేయడానికి పసిడి ఈటీఎఫ్ ఒక మంచి సాధనంగా పనిచేస్తుందని ఆమె వివరించారు.



# ఎస్‌బీఐ నుంచి 2 కొత్త స్కీమ్స్.. ఏప్రిల్ 15 నుంచే అవకాశం.. కనీస పెట్టుబడి ఎంతంటే?

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టేవారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ) అనుబంధ సంస్థ అయిన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ శుభవార్త చెప్పింది. ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగంలో స్వల్పకాలిక డెట్ ఇండెక్స్‌లను ట్రాక్ చేస్తూ రెండు కాన్‌స్టంట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్‌లను ప్రారంభిం చింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (NFO) ఏప్రిల్ 15న ప్రారంభమై ఏప్రిల్ 20న ముగుస్తుంది. మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాజాగా రెండు కొత్త స్కీమ్స్‌ను (NFO) లాంచ్ చేసింది. ఈ వారం లాంచ్ అవుతున్న మొత్తం 4 ఫండ్లలో ఇవి కీలకమైనవి.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెల కోట్లాది రూపాయలు మ్యూచువల్ ఫండ్స్ లోకి వచ్చాయి. అయితే గత మార్చి నెలలోనే రూ.40 వేల కోట్లకు పైగా కొత్తగా ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చాయి. ఈ క్రమంలో ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మూలధన లాభాలను అందించేందుకు అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు న్యూ ఫండ్ ఆఫర్ తో వస్తున్నాయి. ఈ వారం మొత్తం 4 కొత్త ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. అందులో రెండు లాంగ్-షార్ట్ ఫండ్స్ ఉన్నాయి. వీటి సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 15వ తేదీ నుంచే మొదలవుతోంది. తమ పోర్ట్ ఫోలియోలని ఖాళీలను పూరించడంతో పాటు దీర్ఘకాలంలో మంచి లాభాలను అందించేలా కొత్త ఫండ్స్ ను ఫండ్ హౌస్‌లు లాంచ్ చేస్తున్నాయి. ఈ స్కీమ్‌ల గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం..



**ఎస్‌బిఐ నుంచి వచ్చిన 2 కొత్త స్కీమ్స్ ఇవే:**

**ఎస్‌బీఐ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 3-6 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్:**

**సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం:** ఏప్రిల్ 15, 2026.
ముగింపు తేదీ: ఏప్రిల్ 20, 2026.
కనీస పెట్టుబడి: రూ. 5,000.

ఎస్‌బీఐ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 9-12 **మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్:**

**సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం: ఏప్రిల్ 15, 2026.**
**ముగింపు తేదీ:** ఏప్రిల్ 20, 2026.
**కనీస పెట్టుబడి:** రూ. 5,000.

ఈ రెండు ఫండ్లు కూడా డెట్ ఇండెక్స్ విభాగంలోకి వస్తాయి. తక్కువ కాలవ్యవధిలో స్థిరమైన ఆదాయం కోరుకునే పెట్టుబడిదారులకు ఇవి మంచి ప్రత్యామ్నాయంగా ఉంటాయి.

**పెద్ద పెట్టుబడిదారుల కోసం మరో 2 స్కీమ్స్:**
కేవలం ఎస్‌బీఐ మాత్రమే కాకుండా, వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ కూడా రెండు లాంగ్-షార్ట్ ఫండ్లను లాంచ్ చేస్తోంది. ఇవి ప్రధానంగా అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టే వారి కోసం రూపొందించారు.

**స్కీమ్స్:**
డబ్ల్యూఎస్ఐఎఫ్ ఈక్విటీ ఎక్స్ టాప్ 100,
డబ్ల్యూఎస్ఐఎఫ్ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్.
**గడువు:**
ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 29 వరకు.
**కనీస పెట్టుబడి:** రూ. 10 లక్షలు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
25-8-2026

## పార్టీలకు అతీతంగా అర్హులకు
# డబుల్ ఇండ్లను అందించాలి

**అసంపూర్తిగా ఉన్న ఇండ్లను వెంటనే పూర్తి చేయాలి**

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన మున్సిపల్ ఛైర్మన్**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్ గ్రామ పరిధిలో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన మున్సిపల్ ఛైర్మన్ ప్రశాంత్ కుమార్. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల సమీపంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇండ్లను ప్రశాంత్ కుమార్ పరిశీ లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం పేదలకు అందించాలని నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేయకముందే ప్రభుత్వ మారడం జరిగిందని అప్పటినుండి ఆ ఇండ్లు పూర్తి కాకుండా అసంపూర్తిగా ఉన్నాయని వాటిని ఈ ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ తో పాటు రాష్ట్ర మంత్రులు హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి అందించాలని ఆయన కోరారు. ఇప్పటికే చాలా ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని అలాగే వదిలేస్తే అక్కరకు రాకుండా పోతాయని వెంటనే ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఎంతోమంది గూడు లేక ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారని వారి ఆవేదనను అర్థం చేసుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఏదైనా వారు పని చేసేది ప్రజల కోసమే అని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను విరమించి ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలని సూచించారు. సుమారు 240 ఇండ్లు ఉన్నాయని లబ్ధిదారులను గుర్తించి వారికి అందించే విధంగా జిల్లా కలెక్టర్ హౌసింగ్ పీడీ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న ఇండ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని అధికారులు ఆ ఇండ్లను పరిశీలించిన తర్వాత లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ అధికారులతో చర్చించి ఆ ఇండ్లను పరిశీలించిన తర్వాత మాత్రమే లబ్ధిదారులకు అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్ కొలుగూరి సురేష్ మైస రవి పరుశురాం శంకర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రాకెట్‌బాల్ పోటీలకు
# అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

**క్రీడలతో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాల అభివృద్ధి,**

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. వి. నరేందర్‌రెడ్డి**




**కరీంనగర్, (సింగిడి):** క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. వి. నరేందర్‌రెడ్డి అన్నారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో జాతీయస్థాయి రాకెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డా. నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ.. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచిం చారు. క్రీడల ద్వారా పట్టుదల, కృషి, సాధన వంటి లక్షణాలు అభివృద్ధి చెందుతా యని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా శివారులోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన అంతర్‌జిల్లా రాకెట్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఎం. జస్వంత్‌రానా, వి. హర్షవర్ధన్ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అ-ర్హత సాధించారు. త్వరలో తమిళనాడులో జరగనున్న జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు పేరు తీసుకురావాలని డా. నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ పోరాటం. రూ.12 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**




**కరీంనగర్, (సింగిడి):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా కరీంనగర్ బస్టాండ్ బయట గేటు ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం ఇచ్చే దానం కాదని, విద్యార్థుల హక్కు అని అన్నారు. బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండటంతో సర్టిఫికెట్లు అందక, పరీక్షలకు హాజరుకాలేక వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సుమారు రూ. 12 వేల కోట్లుగా పేర్కొన్న పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నాయకత్వంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మేయర్ కోలగాని శ్రీనివాస్, పుప్పాల రఘు, కన్నా కృష్ణ, కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్లలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఐదుగురు అరెస్ట్, రూ. 1.63 లక్షల నగదు స్వాధీనం**

**కోరుట్ల, (సింగిడి):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి భారీగా నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోరుట్ల ఎస్సై జి. శ్యామ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం కోరుట్ల మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట (3 ఝుతీసం +ఖఎవ) ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు రాత్రి దాడులు నిర్వహించారు. ?ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురి ని పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,63,100/- నగదుతో పాటు 52 పేక ముక్కలు, 5 స్మార్ట్‌ఫోన్లను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

**జూదం ఆడితే కఠిన చర్యలు .. కోరుట్ల ఎస్సై హెచ్చరిక**


గ్రామాల్లో ఎవరైనా డబ్బులు పందెంగా పెట్టి పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడతాయని, యువత వీటి బారిన పడకూడదని సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట లేదా జూదం ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి

**భూ బాధితులకు న్యాయం చేయాలి.. సమస్య పరిష్కారం కాకపోతే 'చలో సెక్రటేరియట్'కు పిలుపు**

**మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**కరీంనగర్, (సింగిడి):** రిజిస్ట్రేషన్ చట్టం లోని 22ఏ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ అర్హత కలిగిన ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన పట్టా భూము లను వెంటనే తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. భూ బాధితులకు మద్దతుగా సోమవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ, ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ తదితర భూములను పరిరక్షించేందుకు 22ఏ సెక్షన్‌ను ఉద్దేశించారని తెలిపారు. అయితే నిబంధన లను పాటించకుండా ప్రైవేటు పట్టా భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చడంతో వేలాది మంది భూయజమానులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 22ఏ(2) నిబంధనల ప్రకారం నిర్దేశిత చట్టపరమైన ప్రక్రియను పాటించిన తర్వాతే భూము లను నిషేధిత జాబితాలో చేర్చాల్సి ఉం టుందని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గం లోని రేకుర్తి, కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పట్టా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి భూము లను అనుభవిస్తూ, స్థానిక సంస్థల అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారు సైతం వాటిని విక్రయిం చుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య, వైద్యం, వివాహాలు, కుటుంబ అవసరాల కోసం భూములు విక్రయించుకోవాల్సిన వారికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవ డంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ సెక్షన్‌ను రాజకీయ ప్రయోజనాలకు, అవినీతికి వేదికగా మార్చిందని గంగుల ఆరోపిం చారు. పట్టాదారులకు సరైన నోటీసులు ఇవ్వకుండా, నిర్దేశిత ప్రక్రియ పాటించకుండా వేలాది ఎకరాలు, ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ సెక్షన్ దుర్వినియోగంపై నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రేకుర్తి, కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లోని అర్హత కలిగిన పట్టా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. సమస్యను వెంటనే



పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేసి, అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి 'చలో సెక్రటేరియట్' నిర్వహి స్తామని హెచ్చరించారు. భూ బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నార దాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశం కర్, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అనిల్‌కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, మైఖేల్ శ్రీనివాస్, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, భూ బాధితులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల ఫ్రెషర్స్ డే

**విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం.. రాష్ట్రస్థాయి మార్కులు, ఐఐటీ-జేఈఈ, వైద్య ప్రవేశాల్లో రాణించిన విద్యార్థులకు సత్కారం.**

**శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల ఛైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి**

**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లోని శుభం గార్డెన్స్‌లో సోమవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల ఛైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. 2019 ఏప్రిల్‌లో 520 మంది విద్యార్థులతో ప్రారంభమైన సంస్థ ప్రస్తుతం కరీంనగర్‌లో 2,980 మంది విద్యార్థులకు విద్యను అందించే స్థాయికి చేరుకోవడం అభినందనీయ మన్నారు. విద్యార్థులు చదువుతో పాటు భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు.




కళాశాల నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉపయోగకరంగా ఉండేలా రూపొందిస్తున్నా మని తెలిపారు. అనంతరం 2026 ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించి సత్కరించారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. 2026లో ఐఐటీ-జేఈఈ, వైద్య విద్యలో సీట్లు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల సెక్రటరీ ముద్దసాని సాయి చైతన్య రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు కుటుంబం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు, సహాయ ప్రధాన నిర్వాహకులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటాం**

**ప్రణవ్ హామీతో**

**దీక్ష విరమించిన జర్నలిస్టులు**

**జమ్మికుంట, (సింగిడి):** ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తున్నామని, అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని వారి ఇళ్ల పట్టాలకు సంబంధించి పూర్తి స్థాయిలో సహకరిస్తామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. సోమవారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష స్థలిని ప్రణవ్ సందర్శించారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడతానని సమస్యను పరిష్కరించే విషయంలో కృషి చేస్తానని వారికి వివరించారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఇచ్చిన పట్టాలను మరల న్యాయపరమైన ఇబ్బందులు కలగకుండా చూస్తామని, జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని



అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు పట్టణ, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల ఆందోళనలు రాజకీయ డ్రామాలే..

**22ఎ సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది**

**బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: సూడా మాజీ ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, (సింగిడి)::** 22ఎ భూముల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారని సుడా మాజీ ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తుంటే ప్రతిపక్షాలు ధర్నాల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూడటం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, 22ఎ సమస్య ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిన వెంటనే కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు




త్వరితగతిన విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అధికారులు అదే పనిలో ఉన్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ధరణి పేరుతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భూదందాలు, భూకబ్జాలకు పాల్పడి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శిం చారు. 22ఎ పరిధిలో ఉన్న భూముల యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి పక్షాన నిలబడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటోం దని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ముక్క భాస్కర్, అస్తాపురం రమేష్, మామిడి సత్యనారా యణ రెడ్డి, భారీ, బషీర్, మిరాజ్, తోట అంజ య్య, లక్కిరెడ్డి కిరణ్ రెడ్డి, పెద్దిగారి తిరుపతి, బత్తుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌లను సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలి



**వెల్గటూర్, (సింగిడి):** డీజిల్ ఆటో రిక్షా కార్మిక సంక్షేమ సంఘం ఉమ్మడి వెల్గటూర్ మండలం అధ్యక్షులు జూపాక కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా ఆటో యూనియన్ ఆదేశానుసారం వెల్గటూర్ ఉమ్మడి మండలం ఆటోలు స్వచ్ఛందంగా బంద్ చేసి మద్దతిచ్చారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12000 చొప్పున ఇస్తామని వాగ్దానం చేసి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదానీ, ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల జీవితాల్లో అంధకారం అలుముకుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినందువలన ఆటోల చార్జీలు పెంచుకునే వెసలు బాటు ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిలివేరి తిరుపతి, బిడారి శ్రీనివాస్, పోరండ్ల శేఖర్, సంఘ శ్రీనివాస్, మూగల భాను, బైరం శ్రీనివాస్, బోరే రమేష్, గాదాసు లక్ష్మణ్, అనుమాల నారా యణ, కుసనపల్లి దుర్గయ్య, పంజాల రాజేందర్, పిట్టల సంతోష్, పొన్నం వెంకటేష్, కొల్లూరి నరేందర్, బాదం సత్తయ్య, చింతకింది సత్యం, సింగం రమేష్, క్యాతం విద్యాసాగర్, వేల్పుల గంగారం, సలాది ప్రవీణ్, గడ్డం రవి, గౌరిశెట్టి భూపతి, బెత్తెపు రాజారావు, మేకల సాగర్, ఎర్ర గోకుల నరేష్, సలాది మల్లేష్, గాదాస్ రాజేశం, లక్కం ప్రశాంత్, చిప్పరి ప్రశాంత్, లక్కం శ్రీకాంత్, లక్కం చందు, బొమ్మగాని ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వివాహితను బెదిరించి
# వేధించిన వ్యక్తి అరెస్ట్

**రిమాండ్‌కు తరలింపు**

**కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్‌రెడ్డి**




**కరీంనగర్, (సింగిడి)::** వివాహితను బెదిరిస్తూ లైంగికంగా వేధించిన ఆరోపణలపై ఓ వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ మం డలం. బొమ్మకల్ గ్రామంలోని మధురానగర్‌కు చెందిన వివాహిత కుటుంబంతో గత ఆరు నెలలుగా పరిచయం ఉన్న సీతారాం పూర్‌కు చెందిన బైక్ మెకానిక్ మెడిదొడ్డి సాయికుమార్ ఆమెను ఫోన్, సందేశాల ద్వారా వేధించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం. భర్త ఇంట్లో లేని సమయంలో ఇంటికి వెళ్లి తనతో మాట్లాడాలని, లేదంటే చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అదేవి ధంగా బెదిరింపులకు పాల్పడుతూ పలుమార్లు బలవంతంగా లైంగికంగా వేధించినట్లు తెలిపింది. ఈ విషయాన్ని బయటకు చెబితే ఇబ్బందులు ఎదురవుతాయని భయపెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొంది. భార్యపై అనుమానంతో భర్త ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిందితుడు ఆమెను కలిసిన దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం కుటుంబంలో వివాదం తలెత్తడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, సాక్షులను విచారించడంతో పాటు సీసీ కెమెరా దృశ్యాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడు గణేశ్‌నగర్‌లోని తన ద్విచక్ర వాహనాల మరమ్మతు దుకాణం వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బాధితురాలిని భరోసా కేంద్రానికి తరలించి అవసరమైన సహాయం అందించడంతో పాటు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి పంపినట్లు పోలీసులు తెలిపారు.

## గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో
# చీరల పంపిణీ

**మధురమ్మ ట్రస్ట్ సేవలు అభినందనీయం : మున్సిపల్ ఛైర్మన్ ప్రశాంత్ కుమార్**



**జమ్మికుంట (సింగిడి):** జమ్మికుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ కార్మికులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ ఛైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, సమాజ సేవలో గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్స్ శీలం శ్రీనివాస్ కొలుగూరి సురేష్ పరశురాం సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ తోపాటు ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ వేడుకలను శాంతియుతంగా నిర్వహించాలి

**కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సమావేశం.**

**కరీంనగర్, (సింగిడి)::** మిలాద్ ఉన్ నబీ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మిలాద్ కమిటీ సభ్యులకు సూచించారు. పండుగ సందర్భంగా అవసరమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కల్పిస్తామని తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం మర్కజీ మిలాద్ కమిటీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ, మదరసా అన్వార్ ఉల్ ఉలూమ్ కమిటీల ప్రతినిధులతో పోలీస్ కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మిలాద్ ఉన్ నబీ చివరి రోజు నిర్వహించే జులూస్ శాంతియుతంగా జరిగేలా సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా



సాధారణ నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు కమిటీ సభ్యులు సహకరించాలని గౌష్ ఆలం సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు రాంచందర్‌రావు, సృజన్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, మిలాద్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం

**ఇందుర్తిలో 100 ఎకరాల్లో సాగుకు రైతుల ముందడుగు. సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, (సింగిడి):** ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎకరాకు సుమారు రూ. 1.50లక్షల వరకు ఆదాయం పొంద వచ్చని, ఇందుర్తి గ్రామ రైతులు పెద్ద ఎత్తున ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టాలని పిలుపునిచ్చారు. మంత్రి సూచనతో గ్రామానికి చెందిన రైతులు సుమారు 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు రావడంతో ఆయన అభినందించారు. చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో సోమవారం నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో మంత్రి పాల్గొని గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఆయిల్‌ఫామ్‌తో పాటు నువ్వులు, వేరుశనగ, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.




ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని మంత్రి కోరారు. సౌర విద్యుత్‌తో విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుని మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇందుర్తిలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. రైతుభరోసా కింద 1,249 మంది రైతులకు రూ. 8.06 కోట్లు, రుణమాఫీ కింద 532 మందికి రూ. 4.38 కోట్ల ప్రయోజనం లభించింది. గృహజ్యోతి పథకం కింద 793 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది. గ్రామంలో 862 పింఛన్లు ఉండగా, ప్రతి నెల రూ. 19.61 లక్షలు పంపిణీ చేస్తున్నారు. 1,126 రేషన్ కార్డులతో పాటు కొత్తగా 175 కార్డులు మంజూరు చేశారు. మహిళా స్వశక్తి సంఘాలకు రూ. 32.61 లక్షల వడ్డీలేని రుణాలు, 11 సంఘాలకు శ్రీనిధి కింద రూ. 40 లక్షలు అందించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 66 మంది లబ్ధిదారులకు రూ. 66.06 లక్షలు అందాయి.

ప్రభాతవర్ణ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi మంగళవారం 25-8-2026

## ఎమ్మెల్యే కసిరెడ్డి ఆధ్వర్యంలో
# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం




**కల్వకుర్తి (సింగిడి) :** తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి, గుజ్జల మహేష్, వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు,మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, స్థానిక సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడం వంటి అంశాలపై నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కసిరెడ్డి చర్చించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపని చ్చారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి సూచించారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది ఉండేలా నాయ కులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. ఈ సమావేశంలో, పి సి సి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి.
## కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, (సింగిడి)** ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. -వేంసూరు మండలం లింగపాలెం ఎస్సీ కాలనీ వాసులు గ్రామపంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టుట కొరకు గ్రామ పంచాయతీ రోడ్డు ఇరువైపుల డ్రైనేజీ లను పూడ్చివేశారని, డ్రైన్ లో అక్రమంగా బోరు వేసారని, ఈ పరిస్థితులకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసీల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. -ఖమ్మం నగరం వైఎస్సార్ నగర్ కాలనీ కు చెందిన కాలనీ వాసులు అంబేద్కర్ విగ్రహం ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లు ఆగస్టు 23న అర్ధరాత్రి సేవా లాల్ విగ్రహం పెట్టడం జరిగిందని, గొడవలు అయ్యే అవకాశం ఉన్నదని, ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. -వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన అశోక్ తాను ఆధార్ ఆపరేటర్ సూపర్వైజర్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఉన్నానని, తమకు ఆధార్ సేవలు అందించేందుకు వీలుగా అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈడీఎం కు రాస్తూ పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థి చదువులకు అండగా ఫుడ్ కమిషన్ చైర్మన్



**కల్వకుర్తి (సింగిడి)** వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెం దిన నేనావత్ కౌసల్య తారాసింగ్ నాయక్, రాత్లావత్ లలిత-నిరంజన్ దంపతుల కుమార్తె నిత్యశ్రీ నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో ఫుడ్ కమిషన్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి రెండవ తరగతి వార్షిక పాఠశాల ఫీజు 15,000 పదిహేను వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించా రు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నిత్యశ్రీ కి పాఠశాల వార్షిక ఫీజు మొత్తాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ, నిరు పేద కుటుంబానికి చెందినవారు ఎవరైనా ఉంటే వారి చదువులకు అండగా ఉంటానని ఆయన అన్నారు. చిన్నారి విద్యాభ్యాసానికి అండగా నిలిచి, ఆమె చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీ యమని పలువురు పేర్కొన్నారు. చిన్నారి చదువుకు సహాయం అందించిన నేనావత్ కౌసల్య తారాసింగ్ నాయక్ కి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు,పలువురు అభినం దనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలిచే ఇటువంటి సహాయ సహకారాలు స్ఫూర్తిని నింపు తుంది. కార్యక్రమంలో, గ్రామ పెద్దలు హరిచంద్ నాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామస్తులు తార్యా, హర్యా, శంకర్, లచ్చిరాం, భుజంగం, పాండు, ఉపేందర్, రమేష్, సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై
# సర్కార్ సానుకూల స్పందన
- బంద్ విరమణ.. సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం
- 13 ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకారం



**కొత్తగూడెం (సింగిడి)** రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఈనెల 24న తలపెట్టిన ఆటో బంద్ నిలిచిపోయింది. కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో పలు ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి అంగీకారం లభించింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కనకం సూరిబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో అనేక నిరసనలు చేపట్టినా ఆటో కార్మికుల సమస్యలపై సరైన స్పందన లభించలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను గుర్తించి పరిష్కారానికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రతి ఆటో కార్మికునికి ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సహాయం సహా మొత్తం 13 ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. వీటిని త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ఆర్టీసీలో ఆటోలను ప్రవేశపెడుతున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా వీడియో ద్వారా ఆటో కార్మికులకు హామీలు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రహస్య గుప్త నిధుల తవ్వకాలకు యత్నం..
## నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



**కల్వకుర్తి (సింగిడి)** కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామం లో గుప్తనిధుల కోసం వ్యవసాయ పొలంలో రహస్యంగా తవ్వకాలకు ప్రయ త్నించిన ఐదుగురు వ్యవహారం కల్వకుర్తి మండలంలో కలకలం రేపింది. ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో గుప్తనిధులు ఉన్నాయంటూ ఓ వ్యక్తి నమ్మబలికినట్లు, అతని సూచనల మేరకు మరికొందరు తవ్వకాల పరికరాలు, పూజా సామగ్రితో పొలంలోకి వచ్చినట్లు రైతు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికులు అప్రమత్తం కావడంతో విషయం పోలీసుల దృష్టికి వెళ్లింది.రామస్వామి గుట్ట సమీపంలోని వ్యవసాయ పొలంలో కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని రైతు మల్లయ్య గమనించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పక్క పొలాల రైతులను అప్రమత్తం చేసి వారితో కలిసి అక్కడికి వెళ్లి వారిని ప్రశ్నించగా, గుప్తనిధుల కోసం వచ్చినట్లు వారు చెప్పినట్లు సమా చారం. ఈ క్రమంలో గ్రామానికి చెందిన దసర్ల రాజు ఆంజనేయస్వామి ఆలయం చుట్టుపక్కల గుప్తనిధులు ఉన్నాయని తమకు చెప్పినట్లు వారు వెల్లడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం రాజు అక్కడికి వచ్చి నిధులు ఉన్నాయని భావిస్తున్న ప్రదేశాన్ని చూపించి వెళ్లిపోయినట్లు ఆరో పణలు ఉన్నాయి. ఫిర్యాదులో పేర్కొన్న ఐదుగురు వ్యక్తులుగా దాసర్ల రాజు, సంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎం.డి. సోహైల్, చెన్నమోని జింగయ్య, ఎం.డి. సుల్తాన్ పేర్లు ఉన్నాయి. కారులో తవ్వకాల సామగ్రి అనుమానం రావడంతో స్థానికులు బృందం వచ్చిన కారును పరిశీలించినట్లు తెలి పారు. కారులో గడ్డపారలు, తవ్వకాలకు ఉపయోగించే పరికరాలు, పూ జా సామగ్రి, చిన్న త్రికులు, బొగ్గు ముక్కలు తదితర వస్తువులు కనిపిం చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో గుప్తనిధుల కోసం ముందస్తు ప్రణాళికతోనే వచ్చినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.

**స్థానికుల అప్రమత్తతతో పోలీసులకు సమాచారం**


విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానితు లను విచారించినట్లు సమాచారం. అనంతరం వారిని వాహనంతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. గుప్తనిధుల పేరుతో జరిగిన ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంత తవ్వకాల కోసం ముందుగానే ప్రణాళిక రూపొందించారా గుప్తనిధుల సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది తవ్వకాల సామగ్రిని ఎందుకు తీసుకొచ్చారు అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది. అయితే ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. గుప్తనిధుల పేరుతో అమాయకులను నమ్మించి తవ్వకాలకు పాల్పడ్డారా లేక ఈ వ్యవహారం వెనుక మరేదైనా ఉద్దేశం ఉందా? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

# ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి..
## జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్



**గద్వాల బ్యూరో (సింగిడి)** ప్రజావాణిలో అందిన ఆర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ప్రజల నుంచి మొత్తం 66 ఆర్జీలను స్వీకరించారు. ప్రజలు సమర్పిం చిన దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజావాణి ఆర్జీలను అధికారులు నిరంతరం శ్రీపర్యవేక్షిస్తూ, సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు మండల స్థాయిలో ప్రజావాణి ఆర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,మండల అధికారుల నుంచి ప్రతి వారం ఆర్జీల పరిష్కారంపై నివేదికలు తీసుకుని సమీక్షించాలని ఆదేశిం చారు. ఆర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుం టామని తెలిపారు. అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాకు సంబంధించిన సెన్సస్ నివేదికలను సంబంధిత శాఖలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. వన మహోత్స వం కార్యక్రమా న్ని నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఒక లబ్ధిదారునికి అదనపు కలెక్టర్ ట్రైసైకిల్ ను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటి కలెక్టర్లు రాజ్ కుమార్,మనోజ్ కుమార్ రెడ్డి, ఏ.ఓ మంజుల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో మోటార్ రంగ కార్మికుల సమస్యలు
## పరిష్కరించినందుకు కృతజ్ఞత తెలియజేసిన జేఏసీ నాయకులు



**ఖమ్మం, (సింగిడి) :** స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు ఆటో మోటార్ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఐ ఎన్ టి యు సి మోటా రంగం జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ అధ్యక్ష తన జరిగిన కృతజ్ఞత సభలో ముఖ్య అతిథు లుగా పాల్గొని మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గారు అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి గారు పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐఎన్టియూసీ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కమర్తపు మురళి, నగర అధ్యక్షుడు నరాల నరేష్ మోహన్ నాయుడు మాట్లాడుతూ నిన్న జేఏసీ నాయకుల తో జరి గిన చర్చలలో ఆటో మోటార్ కార్మికుల సమస్య లు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకున్నారని కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షాన ఉంటుందని పేద ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వారు తెలియజేశారు త్వరలోనే మీసమస్యలన్నీ పరిష్కారం అవుతా యని ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మం త్రులు తుమ్మల నాగేశ్వరరావు , బట్టి విక్రమార్క , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకు పోయి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని వారు తెలియజేశారు . నాయకులు స్వీట్లు పంచి శు భాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్ర మంలో జేఏసీ నాయకులు సీఐటీయూ జిల్లా ఉపేందర్ నాయకులు షాఖ సత్తార్ మియా, కంకణాల శ్రీనివాస్గా,రవీందర్, శ్రీకాంత్ ఏఐటీయూసీ నాయకులు రావుల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు వీరేందర్ రెడ్డి నగర అధ్యక్షుడు తోట సైదులు పార్లమెంట్ అధ్యక్షుడు కటకూరి ఉమా రావు మరియు యూనియన్ నాయకులు మైస ఆంజనేయులు , రఫీ ,లక్ష్మీనారాయణ , సలీం , ముల్లర్, నాయుడు, జానీ మియా, మేకల వినోద్, పండు, కృష్ణమాచారి, శేఖర్, వెంకటేశ్వర్లు , శివరాత్రి నాగేశ్వరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన ఓం యోగశాల సాధకులు



**బోధన్ ప్రతినిధి(సింగిడి)** బోధన్ పట్టణంలో ఇటీవల జరిగిన 7వ జిల్లా యోగాసన పోటీలలో బోధన్ ఓం యోగశాల సాధకులు వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి 23 పతకాలు సాధించారు. సబ్-జూనియర్స్ జూనియర్స్, సీనియర్స్, సీనియర్ బి,సీనియర్ సి విభాగాలలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి 23 మంది రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలకు ఎంపికయ్యారు. ఓం ఓం యోగశాల మాస్టర్ క్యాతం గంగాధర్,ఆర్గనైజర్ చరణ్,యోగ సాధకులు శ్రీనివాస్,భాస్కర్, నరసింహస్వామి రాజౌెంకటేష్,పోశెట్టి,మనోహర్,కృష్ణ,విలాస్, బోధన్ కోచ్‌లు హర్షం వ్యక్తం చేస్తూ,విజేతలందరికీ అభినందనలు తెలిపారు.

# బదిలీపై వెళుతున్న జూనియర్ సివిల్ జడ్జి నిష్కపాత్రుడు కు ఘన సన్మానం



**మధిర, (సింగిడి)** మధిర జూనియర్ సివిల్ జడ్జి నిష్క పాత్రుడు సీనియర్ సివిల్ జడ్జిగా గద్వాల జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శిగా పదోన్నతి పొంది బదిలీపై రిలీవ్ అవుతున్న సందర్భంగా మధిర కోర్టు ప్రాంగణంలో మధిర బార్ అసోసియేషన్, ప్రాసిక్యూషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించబడింది. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా మధిర కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీప్తి వేముల హాజరై న్యాయమూర్తి నిష్కపాత్రుడు సేవలను కొనియాడారు. ఈ సంద ర్భంగా న్యాయమూర్తి నిష్కపాత్రుడిని ఏ పి పి జన్ను భద్రయ్య, బార్ అసోసి యేషన్ అధ్యక్షులు చావలి రామరాజు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, చింతల గోపాల్, కట్టా పూర్ణ చంద్రరావు, పుల్లారావు, నెల్లూరి రవి, అబ్రహం, కోట జ్ఞానేష్, గంధం శ్రీనివాస్, సునీత, మాధురి, తూములూరి సంధ్య, వెంకట్రావు, సతీష్, రమేష్ ,తదితర న్యాయవాదులు, మధిరలో ఉన్న మూడు కోర్టుల కోర్టు సిబ్బంది, కోర్టు పోలీసు సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు కలిసి సత్క రించి పదోన్నతికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తి నిష్కపాత్రుడి సేవలను, న్యాయవ్యవస్థ పట్ల వారు చూపిన అంకిత భావాన్ని పలువురు కొనియాడారు. ఆమె (నిష్క పాత్రుడు) భవిష్యత్తు న్యాయ సేవా ప్రస్థానం మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షిం చారు. తదనంతరం మధిర బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవా దులు, కోర్టు సిబ్బంది, ఏపీపీ, కోర్టు పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని బదిలీపై వెళుతున్న న్యాయమూర్తికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ సునీత ప్రభాకర్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాలని ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో,ఉప సర్పంచ్ రాఘవేందర్, వార్డు సభ్యులు,స్థానిక ప్రజలు ,పాల్గొన్నారు.

**కల్వకుర్తి (సింగిడి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పడకల్ గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజలతో కలిసి సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేయడం జరిగింది. గ్రామంలోని ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో రహదారి సౌకర్యాన్ని మెరుగుపరి చేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారం భించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాభి వృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో వర్షాకాలంలో బురద, గుంతలు వంటి సమస్యలు తొలగి ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు అందుబా టులోకి వస్తాయని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కాలనీ, ప్రతి వీధిలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిం చాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## నగర ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న
# సమస్యలు పరిష్కారించాలి




**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి)** నిజామాబాద్ నగర ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగర కార్పొరేషన్ కమిషనర్ కి వినతి పత్రం చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రధాన కార్యదర్శి రామ్ మోహన్ రావు మాట్లాడుతూ రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల, డ్రైనేజీ రోడ్లపై ప్రవహించి పారిశుధ్య సమస్యలు ఏర్పడుతు న్నాయని, దోమలు, వీధి కుక్కల బెడద వల్ల ప్రజలు అనారోగ్యా నికి గురవుతున్నారని, రోడ్లపై పశువులను వదలడం వల్ల, ఫూట్ పాత్ లను ఆక్రమించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలను పరిష్కారిం చాలని కోరారు. డ్రింకింగ్ వాటర్ నాణ్యతను పెంచి సప్లయ్ చేయాలని, అన్ని ఏరియాల్లోకి ఇంటింటికి వచ్చి చెత్తను సేకరిం చాలని, రోడ్లపై వేసిన చెత్తను వెంటది వెంట ఎత్తివేసేలా చర్య లు తీసుకోవాలని కమిషనర్ ఆఫీస్‌లో ఫిర్యాదుల వ్యవస్థను పటిష్టం చేసి గడువులోగా సమస్యను పరిష్కారం చేయాలని, పార్కులను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల నుండి పన్నులు వసూళ్లు చేస్తున్న అధికారులు ప్రతినిత్యం నిజామాబాద్ నగర ప్రజలుఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కారం చేయడంలో ముందుండాలని అన్నారు. ఈ విషయమై నగర కార్పొరేషన్ కమిషనర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ షేక్ హుస్సేన్, కరిపే రవీందర్,క్యాతం జగన్ మోహన్, డి. సత్యానంద్, నారాయణ, నాగేశ్వర్ రావు, రాధా కిషన్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి 103 ఫిర్యాదులు



**నిజామాబాద్(సింగిడి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేత్రదానం చేయండి.. మరొకరికి చూపునివ్వండి
## -ఖమ్మం జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డా రామారావు పిలుపు.



**ఖమ్మం (సింగిడి)** "నేత్రదానం-శ్రేష్ఠదానం". మర ణం తర్వాత కూడా ఇతరుల జీవి తాల్లో వెలుగుగా బతికే గొప్ప అవ కాశం నేత్రదానంద్వారా సాధ్యమవుతుందని.,జాతీయఅంధత్వ దృష్టి లోపాల నివారణ కార్యక్రమం లో భాగంగా 2026 ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు జిల్లా వ్యాప్తంగా 'నేత్రదాన పక్షోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి (DM&HO)తెలిపారు.

ప్రజలు ఇవి గుర్తించాలి....

**సమయం:** వ్యక్తి మరణించిన 6 నుండి 8 గంటలలోపు నేత్ర దా నం చేయాలని. ఒకరి ద్వారా ఇద్దరికి చూపు లభిస్తుంద ని. శరీరంలో మార్పు ఉండవు.. నేత్రదానం వల్ల మృతదేహ రూపంలో ఎటువంటి మార్పు ఉండదని కేవలం పైభాగంలోని కార్నియాను మాత్రమే సేకరిస్తారని.

**అర్హత:** కామెర్లు, ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్ ఉన్నవారు తప్ప... బీపీ, టీబీ, ఆస్తమా, కళ్లద్దాలు ఉన్నవారు క్యాటరాక్ట్ (శుక్లాలు) ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయ వచ్చునని. **ఉచిత రవాణా**: నేత్రదానం చేసిన వారి భౌతిక కాయాన్ని ఖమ్మంలోని ఆసుపత్రుల నుండి స్వస్థలాలకు చేర్చేందుకు ఉచిత వ్యాన్ సౌకర్యం కలదని,. నేత్రదానాన్ని మన కుటుంబ ఆచారంగా మార్చుకుందామని తెలియజేశారు.

# మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

**అశ్వాపురం,(సింగిడి)** అశ్వాపురం మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సంద ర్భంగా ప్రాజెక్ట్ పనుల పురోగతిని సంబం ధిత అధికారులను అడిగి తెలుసుకు న్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షించారు. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్ట్ పనులు పూర్తయితే ఆయకట్టు రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# హైకోర్టు తీర్పుతో అక్రమ కేసుల కుట్ర భగ్నమైంది: రేగా కాంతారావు

### 2029 ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి తగిన తీర్పు ఇస్తారు
### తప్పుడు కేసులతో వేధింపులకు గురిచేశారని ఆరోపణ.. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ





**మణుగూరు, (సింగిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సోమవారం పినపాక నియోజకవర్గంలోని కరకగూడెం, పినపాక, మణుగూరు మండలాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విస్తృత బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ జెండాలతో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ మణుగూరు మండలంలోని కిన్నెర కళ్యాణ మండపం వరకు కొనసాగింది. అనంతరం కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ.. 2029 ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వ విధానాలపై తమ తీర్పును వెల్లడిస్తారని అన్నారు. తప్పుడు వాగ్దానాలు, నిర్ణయాలు, అక్రమ కేసులతో ప్రభుత్వం కాలం గడుపుతోందని ఆరోపించారు. ప్రజలే అంతిమంగా తీర్పు ఇస్తారని పేర్కొన్నారు.

**తప్పుడు కేసులతో కార్యకర్తలను వేధిస్తున్నారు**

బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై రేగా కాంతారావు విమర్శలు చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టడం ద్వారా సాధించేది ఏమీ లేదని అన్నారు. తనపై కూడా అక్రమ కేసు నమోదు చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తన రాజకీయ ఉనికిని దెబ్బతీసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అయితే హైకోర్టు జోక్యంతో ఆ ప్రయత్నం విఫలమైందని తెలిపారు.

**హైకోర్టులో ఎఫ్ఐఆర్ కొట్టివేత**

తనపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసిందని రేగా కాంతారావు తెలిపారు. తనపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం తరఫున పలువురు న్యాయవాదులను కోర్టులో నియమించారని, అయినప్పటికీ న్యాయస్థానంలో తనకు ఊరట లభించిందని పేర్కొన్నారు. అక్రమ కేసుల వ్యవహారంలో హైకోర్టు నుంచి ఎఫ్ఐఆర్‌పై ఊరట పొందిన తొలి కేసు తనదేనని ఆయన అన్నారు. తనను సుమారు 25 రోజులపాటు వివిధ ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఈ పరిణామాలను ప్రజాస్వామ్యవాదులు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

**మంత్రులపై ఆరోపణలు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తన రాజకీయ ఉనికిని దెబ్బతీయడమే ముగ్గురు మంత్రుల లక్ష్యంగా ఉందని రేగా కాంతారావు ఆరోపించారు. తనపై నమోదైన కేసులో హైకోర్టు తీర్పుతో వారికి రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో తనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని, అయితే కాలం మారుతుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా సమాధానం చెబుతారని అన్నారు.

**ఐదు స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లోనూ బీఆర్ఎస్‌ను గెలిపించి పార్టీ అధినేత కేసీఆర్‌కు కానుకగా అందిస్తామని రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన ఆస్తుల వివరాలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. తాను తన ఆస్తులను పేదలకు పంచేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈ విషయంలో ఎమ్మెల్యే కూడా తన వైఖరిని వెల్లడించాలని కోరారు.

**25 రోజులు అజ్ఞాతంలో ఉన్నా.. న్యాయపోరాటం చేశా**

తనపై కేసుల నేపథ్యంలో సుమారు 25 రోజులు అజ్ఞాతంలో ఉన్నానని రేగా కాంతారావు తెలిపారు. తనను అరెస్ట్ చేస్తారంటూ ప్రచారం జరిగినప్పటికీ తాను న్యాయపరమైన మార్గాన్ని ఎంచుకున్నానని చెప్పారు. ప్రమాదం ఉందని భావించినప్పుడు దూరంగా వెళ్లి భద్రత పొందే ధైర్యం తనకు ఉందని, అనంతరం న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందినట్లు పేర్కొన్నారు. మహిళలంటే తనకు ఎంతో గౌరవం ఉందని, వారిని కుటుంబ సభ్యులుగా భావిస్తానని తెలిపారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక కేసుల ద్వారా భయపెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

**అధికారులకు హెచ్చరిక**

భవిష్యత్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, పోలీసు అధికారుల వ్యవహారాలను గుర్తుంచుకుంటామని రేగా కాంతారావు అన్నారు. రెండున్నరేళ్ల తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ పరిస్థితులు మారుతాయని వ్యాఖ్యానించారు. తమ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దని, సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో తమను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, ప్రజాప్రతినిధుల వ్యవహారాలను రాజకీయంగా ప్రశ్నిస్తామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పార్టీ కార్యకర్తలను ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే తమ కార్యకర్తలకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రేగా కాంతారావుకు మద్దతు తెలిపారు.

## వన మహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

### నేటి (మంగళవారం)మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టాలి:
### రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ:



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** సోమవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు నాటిన మొక్కలు, ఇంకా నాటాల్సిన మొక్కలు, నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం అనుకూలమైన వర్షాలు కురుస్తున్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రేపు(మంగళవారం) అన్ని జిల్లాల్లో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించి, వన మహోత్సవం లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, ఇతర అనువైన ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్కకు రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం చేపట్టనున్న వన మహోత్సవం మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన వన మహోత్సవం లక్ష్యంలో మిగిలిన మొక్కల నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని తెలిపారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, జియో ట్యాగింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 27న పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహిస్తాం

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్, (సింగిడి):** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. నాగర్‌కర్నూల్ నుంచి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనాల్లో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సభలు నిర్వహించాలని, బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ సూచించారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ నోటీసుల జనరేషన్ పూర్తి చేసి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, ఆగస్టు 27న గ్రామ, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మూడు నియోజకవర్గాల్లో అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. సభలపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫారం-6, 7, 8లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని పేర్లను సభల్లో చదివి వినిపించడంతో పాటు, పేరు లేని అర్హులైన పౌరులను గుర్తించాలని తెలిపారు. 01.10.2026 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకునే వారు ఫారం-6, డిక్లరేషన్, ఆధారాలతో ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తప్పులు, వివరాల వ్యత్యాసాలుంటే ఫారం-8, అనర్హుల పేర్లపై ఫారం-7 ద్వారా అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, సమయం, ప్రదేశం స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీకి విచారణకు మధ్య కనీసం ఏడు రోజుల వ్యవధి ఉండాలని తెలిపారు. నోటీసుల పంపిణీ, విచారణ వివరాలు, ఓటర్లు సమర్పించిన ఆధారాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోలతో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభల వివరాలను డాక్యుమెంట్ చేసి, ఫొటోలను బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చెన్నయ్య, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, ఆర్డీఓలు, ఎంఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### -సిఐటియు జిల్లా కార్యదర్శి మండ్ల రాజు





**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలనుపరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మండ్ల రాజు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాల పెంపు జీవో 60 ని పకడ్బందీగా అమలు చేసికార్మికులపై పని భారం పెంచే జీవో 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంటపాల కేంద్రం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, సిఐటియుజిల్లా సహాయ కార్యదర్శి సూర్య వంశం రాము మాట్లాడుతూ గ్రామ పంచాయతీకార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి కార్మికులనుపర్మినెంట్ చేస్తామని, వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలమేనిఫెస్టోలో చెప్పిందని గుర్తు చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటికాంగ్రెస్ సర్కార్ కార్మికుల నిరసన శిబిరాల, టెంట్ల వద్ద మద్దతుప్రకటించి గతంలో చెప్పిన మాటలు, హామీలు, వాగ్దానాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిలబెట్టుకోవాలని వారు డిమాండ చేశారు. ఎండా, వాన, చలిలో కష్టపడి పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్షసేవలందిస్తున్న పంచాయతీ కార్మికులు అత్యధికులు బడుగు బలహీన వర్గాలే కావడంవల్లే ప్రభుత్వం వివక్షపాటిస్తుందన్నారు. జీవో నెంబర్ 51 ద్వారామల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులకు పని భారాన్ని పెంచడంసరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం గ్రీన్ ఛానల్ ద్వారాకార్మికుల అకౌంట్లో వేతనాలు జమ చేయాలని అన్నారు. ఆన్లైన్లో నమోదు కానికార్మికుల పేర్లు నమోదు చేయాలని, అక్రమంగా సిబ్బందిని తొలగిస్తున్నసర్పంచ్ లపైన ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వేతనాలు పెంచమంటే పని భారం పెంచుతారా అని ప్రశ్నించారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణించిన ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ఇవ్వలేకపోవడం, కనీస ప్రాథమిక హక్కుగాపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల ప్రాథమికహక్కులను కాల రాసి కార్పొరేట్లకు ఉపయోగపడే 8 గంటల పని విధానాన్ని 12గంటలకు పెంచిన బిజెపి సర్కార్ కు మద్దతుగా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానంచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. కరోనా వంటికష్టకాలాల్లో ప్రజల కోసం తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి ఆదుకున్న పంచాయతీకార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైనదికాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను, సీఐటీయూని చర్చలకుఆహ్వానించి సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తు కార్యచరణ రూపొందించిమరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. దీనికి రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియుజిల్లా నాయకులు మద్దిలేటి, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు అక్తర్ పాషా,అంజి, రాములు, రమణమ్మ, చెన్నమ్మ, రామచంద్రయ్య, అలివేల, ఎల్లస్వామి,కోటమ్మ తదితరులు పాల్గొన్నారు

## ఇచ్చిన హామీలతోపాటు సంక్షేమ అభివృద్ధి పనులు చేస్తున్నాం

### రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

### -రూ.87.53 కోట్ల నిధులతో నిర్మించిన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్.. ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు





**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలనే కాకుండా ఇంకా అదనంగా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధిపథంలో నడిపిస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డివెంకట్ రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో సాగునీటి రంగాన్ని మరింతబలోపేతం చేస్తూ కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను రాష్ట్రరోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,అబ్కారి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సోమవారంమోటార్లను ఆన్ చేసి ప్రారంభించారు. రూ. 87.53 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈప్రాజెక్ట్ ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలోమొత్తం 4,235 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన హామీలను అమలు చేయడంతో పాటు చెప్పని అనేక అభివృద్ధి కార్యక్రమాలనుకూడా చేపడుతోందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు నిర్మించుకునేందుకు పేదలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, రాష్ట్రాన్ని గుడిసెలులేని రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందనితెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సుమారురూ. 36 వేల కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. అన్నిప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈరోజు కర్నే తాండ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగాఉందని పేర్కొంటూ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కర్నె తండా లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి జిల్లాలో 3384 ఎకరాలకు,నాగర్ కర్నూల్‌జిల్లాలో 851 ఎకరాలు కలిపి మొత్తం 4,235 ఎకరాలకు సాగునీరుఅందించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు ఎంతోప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గిరిజనుల ఆకాంక్ష మేరకు ప్రాజెక్టు పేరును గిరిజనుల ఇష్టదైవం అయిన శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామనిహామీఇచ్చారు. ఇదే కాకుండా పాలమూరు ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని మంత్రితెలిపారు.

**-యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**
**-మంత్రి జూపల్లి కృష్ణారావు**

గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మంత్రి జూపల్లికృష్ణారావు విమర్శించారు. సంవత్సరానికి రూ. 60 వేల కోట్ల రూపాయలు వడ్డీకింద చెల్లించాల్సి వస్తుందన్నారు. అయినప్పటికీ ప్రజలకు అవసరమైన సంక్షేమకార్యక్రమాలను కొనసాగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామనిచెప్పారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూబాధ్యతగా వ్యవహరించాలని, యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు




అవగాహనకార్యక్రమాలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**-నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి**

కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి జిల్లాలో 3,384ఎకరాలకు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాలకు సాగునీరు అందనుందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి చెప్పారు. ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 87.53కోట్లు ఖర్చు చేశామని, 245 ఎకరాల భూ సేకరణ కూడా చేపట్టామని వివరించారు. గతపాలకులు అనేక ప్రాజెక్టులను పూర్తి చేశామని ప్రజలను మభ్యపెట్టారని, అయితేవాస్తవంగా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేస్తోందన్నారు. మిగిలిన బ్యాలెన్స్ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామనితెలిపారు. కర్నె తండా పరిధిలోని తండాలకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని
సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నసంక్షేమ కార్యక్రమాలను ఎంపీ వివరించారు. రాష్ట్రంలో 3.35 కోట్ల మందికిసన్న బియ్యం, 7 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, 70 వేల ఉద్యోగాలు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజూరు వంటి కార్యక్రమాలనుప్రభుత్వం చేపడుతోందన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకంఅందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో మొబైల్ టవర్ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు.

**-పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తెచ్చాం**
**-వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

గత ప్రభుత్వ హయాంలో కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కోసం రూ. 87కోట్లతో జీఓ తీసుకువచ్చినప్పటికీ, సుమారు రూ. 47 కోట్లు ఖర్చు చేసి పనులనుమధ్యలోనే నిలిపివేశారని, మిగిలిన రూ. 40 కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చు చేసిపూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పెండింగ్‌లో ఉన్న పనులనుసుమారు రూ. 29 కోట్లు ఇప్పటివరకు ఖర్చు చేయడం జరిగిందని, మిగిలిన రూ. 11కోట్లు భూ సేకరణ, ఇతరత్రా పెండింగ్ పనులకు ఖర్చు చేసి పూర్తి చేయనున్నట్లుతెలిపారు. వనపర్తి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేకప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ. 2,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**-సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత**
**-నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

ప్రజా ప్రభుత్వంలో మార్కండేయ ప్రాజెక్ట్‌తో పాటు కర్నె తండా వంటిసాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి పూర్తి చేసుకున్నామని నాగర్ కర్నూల్ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగాప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తి చేయడంపై దృష్టిసారించిందన్నారు. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంత్ సేవాలాల్ ఇరిగేషన్ప్రాజెక్ట్‌గా పేరు పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని, ఇందుకుసంబంధించిన చర్యలు చేపడతామని తెలిపారు. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ప్రాజెక్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతోపాటు వ్యవసాయాభివృద్ధికి మరింత ఊతం లభించనుందని, ప్రాజెక్ట్ ద్వారా నీరుఅందనున్న తండాల పరిధిలోని ఆయకట్టు భూములు సాగులోకి రావడంతో రైతులకు ఎంతోప్రయోజనం చేకూరనుందని చెప్పారు. అనంతరం వనపర్తి, నాగర్ కర్నూల్ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్‌తో కలిసి సర్జ్ పూల్ వద్ద ప్రారంభమైన నీటిప్రవాహానికి పూజలు చేసి పూలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్,మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులుఅధికారులు తదితరులు పాల్గొన్నారు

## సారంపల్లి మృతి పార్టీకి తీరని లోటు



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** సిపిఎం సీనియర్ నాయకులు, రైతుసంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మృతి సిపిఎం పార్టీకితీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కార్యదర్శి వర్గసభ్యులు ఎండి. జబ్బార్ అన్నారు. సోమవారం ఉదయం 3 గంటలకు హైదరాబాదులోనినిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మల్లారెడ్డి తుది శ్వాస విడిచారనిచెప్పారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి లోని పార్టీ కార్యాలయంలోకామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజీవి సారంపల్లి
మల్లారెడ్డి వరంగల్ జిల్లాలో పార్టీ జిల్లా కార్యదర్శిగా, రైతు సంఘంజిల్లా కార్యదర్శిగా, రైతు సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సభ అఖిలభారత ఉపాధ్యక్షులుగా చాలా కాలంపాటు పనిచేశారని వారు గుర్తు చేశారు. 88 ఏళ్ల వయసులో ఆయన మరణించడంపార్టీకి తీరని లోటని, ఈ సందర్భంగా ఆయనకు సంతాపం తెలుపుతూ మౌనంపాటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సిపిఎం నాయకులుప్రకటించారు. ఆయన వ్యవసాయ రంగంలో నిపుణుడని, నిష్ణాతుడని అనేకమందిఅధికారులకు, అనధికారులకు, పార్టీ కార్యకర్తలకు, రైతు సంఘం కార్యకర్తలు,
నాయకులకు అనేక విషయాలపై వ్యవసాయ రంగంపై ప్రాజెక్టులపై వివరణ ఇచ్చారనిచెప్పారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ వచ్చినప్పుడు అవి పాలకులకు ఎట్లాలాభం, ప్రజలకు ఎట్లా నష్టం అని విశ్లేషించే వారని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.బాల్ రెడ్డి,మండ్ల రాజు, ఏ.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.పరమేశ్వర చారి,కౌన్సిలర్ గంధం మదన్, డి.కురుమయ్య, బిసన్న, ఏ.కృష్ణయ్య, నందిమల్ల రాములు,గోపాల్ దీన్నే సర్పంచ్ కవిత, ఏం.మన్నెం, సుగుణమ్మ, మహేష్, నారాయణ, ఆఫీస్ కార్యదర్శి ఉమా తదితరులు పాల్గొన్నారు

## 18 మంది అధికారులు.. 12 మందే హాజరు.. ప్రజావాణిపై నిర్లక్ష్యమా?




**మల్హార్ (సింగిడి):** మల్హార్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు 18 మంది ఉండగా, 12 మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. హౌసింగ్‌కు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల కోసం మూడు దరఖాస్తులు ప్రజావాణిలో అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి హౌసింగ్ ఏఈ, ఎలక్ట్రిసిటీ ఏఈ, ఆర్అండ్‌బీ, ఐకేపీ, ఫారెస్ట్ అధికారి తదితరులు గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# విలువల కోసం పాటు పడిన ధీరుడు బి.పి.మండల్

## ఆగస్టు 25... మండల్ జయంతి

మనస్సాక్షిని వంచింపలేక, విలువలకై పరితపించి, తాము నమ్మిన సిద్ధాంతాల నుండి దూరం కాలేక, ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమై, కుల తత్వాన్ని ఎట్టి స్థితిలో నూ ప్రదర్శింపక భారత దేశ



చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పొందిన మానవతా వాది బి.పి. మండల్ గా ప్రసిద్ధులైన బిందేశ్వర ప్రసాద్ మండల్. భారత పార్లమెంట్ సభ్యులుగా, బీహార్ ముఖ్యమంత్రిగా, వెనకబడిన తరగుతుల కమిషన్ చైర్మన్ గా, పదవి లేవైనా, లక్ష్య సిద్ధికై వాటిని తృణప్రాయంగా భావించి ఆదర్శనీయులు అయినారాయన. ధనిక జమీందారీ కుటుంబంలో జన్మించినా, వెనక బడిన వర్గా ల అభ్యున్నతికి రాజీలేని సిద్ధాంత పర పోరాటాలు చేసి, బీ సీ ల బాంధవునిగా చిర స్థాయి గా నిలిచి పోయా మండల్. 1918 ఆగస్టు 25 న బీహార్ లో ని బనారస్ లో యాదవ భూస్వామ్య కుటుంబంలో లు జన్మించి మాధేపురా జిల్లాలో ని మోరో గ్రామంలో పెరిగిన మండ ల్ మండే పురంలో ప్రాథమిక విద్యను, దర్భాంగా లో ఉన్నత విద్యను పూర్తి చేశారు. 1930లో పాట్నాలో ఇంటర్ పూర్తి చేసి, కలకత్తా ప్రసిడెన్సీ కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసం కోసం చేరి, అనివార్య కారణాల వల్ల చదువు వదిలి పెట్టారు. 23వ ఏట జిల్లా కౌ కౌన్సిల్ కు, 1945 – 51 మధ్య మాధేపురా లో జీతం లేకుండా స్వచ్ఛందంగా జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గా పని చేశారు.

జాతీయ కాంగ్రెస్లో చేరి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. బీహార్ శాసనసభకు 1952లో ఎన్నికై, అధికార పార్టీలో ఉంటూ, బీహార్ లో ని కుర్మీలనే బీసీలపై రాజపు త్రుల దాడిని నిరసించి, తమ నియోజకవర్గంలో పామా గ్రామంలో దళితులపై, మైనా రిటీలపై పోలీసుల అత్యాచారాల గురించి నప్పం మాటాడాలని మండల్ భా వించారు. కాని అధికార పక్షంలో ఉండి మాటాడ కూడదని ని ఎం ఆదేశిస్తే, నమ్మిన విలువల కోసం పార్టీ నుండి వైదొలిగి, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాశ్ నా రాయణ్ స్ఫూర్తి ద్వారా సంయుక్త సోషలిస్టు పార్టీలో చేరి, ప్రతిపక్ష పాత్ర పోషించడానికి వెనకాడలేదు. 1967లో సోషలిసు అభ్యర్థుల ఎంపికపై ఆయన సల్పిన కృషి, ప్రచారం కారణంగా 1962లో కేవలం 7 సీట్లకే పరిమితంగా ఉన్న పార్టీకి 1967 లో 69 సీట్లు రావడం ఆయన చిత్తశుద్ధికి తార్కాణం. బీహార్ ని ప్రప్రథమ కాంగ్రెసేతర ప్రభుత్వంలో ఎంపీ అయి ఉండీ, ఆరోగ్య మంత్రిత్వ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వంతో విభేదాల వల్ల కాంగ్రెస్ పార్టీ బయటి మద్దతు పొంది, 1968 ఫిబ్రవరి 1న ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ మద్దతు పొంది ఉన్నా, సీనియర్ కాంగ్రెస్ నేతల అవినీతిపై అయ్యర్ కమిషన్ ద్వారా విచారణ జరిపించడంలో వెనకాడలేదు. కమిషన్ నివేదికను బయట పెట్ట రాదనే నాటి ప్రధాని ఇందిర ఒత్తిడి తో రాజీ పడక పోవడం మూలాన అవిశ్వాసం, ఫలితంగా రాజీనామా చేయాల్సి వచ్చినా వెరవలేదు.



"ఓట్లు సంపాదించడానికి కులపర విజ్ఞపులు చేసినా, ప్రభుత్వ నిర్ణయాలలో కులతత్వం సహించేది లేదని" స్పష్టం చేసిన ధీశాలి. నిష్పక్షపాతి ఆయన. 1967 మార్చి 5న సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ) స్థాపించి, 1967 నుండి 70 వరకు లోకసభ సభ్యుడిగా, 1972 లో తిరిగి ఎన్నికై, నాటి సిఎం పాండే, మిథిలా విశ్వవిద్యాలయంలో కింది సాయి ఉద్యోగం నుండి

వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులానికి చెందిన వారిని నింపాలని ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 1974లో శాసన సభ్యత్వానికి రాజీనామా చేసిన జయ ప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో చేరి, అవినీతి వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 1977లో జనతా పార్టీ పక్షాన లో కసభకు ఎన్నికై, 79 వరకు కొనసాగారు. ఎమర్జెన్సీ అనంతరం అధికారానికి వచ్చిన జనతా ప్రభుత్వం ఇందిరా గాంధీ పై కక్ష సాధింపును వ్యతిరేకించారు. ఇది మండల్ ఆదర్శ వ్యక్తిత్వ ఒక పార్శ్వం కాగా, సామాజిక, విద్య తదితర రంగాల్లో ఇతర వెకబడిన వరాల సమానత్వాన్ని ఆయన స్వప్న అనన్య సామాన్య కృషి మరో పార్శ్వం. సామాజిక, ఆర్థిక, విద్యా మూలాలను కనుగొని, బీ సీ కులాల వారు దేశంలో 52 శాతం ఉన్నారని, వారికి న్యాయ పరంగా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కృషి చేశారు. 1979 జనవరి 1 న నా సిరి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులతో పౌర

హక్కుల కమిషన్ నియమించగా, మండల్ చైర్మన్ గా, 1980 డిసెంబర్ 31న నివేదిక అందజేశారు. అన్ని ప్రభుత్వ, విద్యా సంస్థలు ఇతర వెనక బడిన తరగతులు బిసి) అభ్యర్థులకు రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని సిఫార్సు చేశారు. రిజర్వేషన్లు 50శాతం, మించరా దనే సుప్రీం కారు ఆదేశాలను అనుసరించి, ఎస్సి, ఎస్టీ లతో కలిపి 49 శాతం ఉండేలా బికినీలకు 27శాతం రిజర్వేషన్లు ఉండాలని కమిటీ ద్వారా సిఫార్సు చేశారు. తర్వాత వచ్చిన ఇందిర ప్రభుత్వం అమలు చేయక హో గా దశాబ్దం తర్వాత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధాన మంత్రిత్వ పాలనలో అమలుకు నోచుకుంది. 1982 ఏప్రిల్ 13న మండల్ మరణించారు లో భారత ప్రభుత్వం ఆయన గౌరవం ఒక పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. భారతీయ రాజకీయ, సామాజిక, చారిత్రిక నిర్మాణాలు మండల్ కమిషన్ నివేదిక పాత్ర మరపురానిది, చారిత్రక మైనది.

మండల్ జయంతి సందర్భంగా వెనక బడిన వర్గాల మార్గ దర్శకులైన మండ ల్ జయంతి వేడుకలు నిర్వహిస్తూ, ఘనంగా నివాళి అర్పించాల్సిన అవసరం ఉంది.

– రామకిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...
9440595494

# ప్రకృతి – వికృతి

భావం లేని పదం
శ్రమ లేని జీవితం
ఉషోదయం లేని దినం
సమాధానం లేని ప్రశ్న
గమ్యం లేని ప్రయాణం
కష్టాలు లేని బతుకు
ఉప్పు లేని సముద్రం
అక్షరాలు లేని పుస్తకం
అంతం లేని జీవితం
అనారోగ్యం లేని దేహం
సముద్రంలో కలవని నది
నీడనివ్వని మహావృక్షం
దాహం తీర్చని జలం
సుగంధం లేని పువ్వు
సంతోషం లేని నవ్వు
బోధించని గురువు
నేర్చుకోలేని శిష్యుడు
ఎండ ఇవ్వని సూర్యుడు
వెన్నెల పరచని చంద్రుడు
భక్తి లేని పూజ
కదల లేని కాలం
ప్రాణం నిలపని శ్వాస
లేకపోవడం ప్రకృతి
ఉంటే అది వికృతి !

మధుపాలీ
9949700037



# ప్రజా సంక్షేమం, అభివృద్ధి తో ముందుకు సాగుతున్నాం...

**భూ భారతి ద్వారా**
**భూ సమస్యలకు పరిష్కారశీ**
**ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూ రీ–సర్వే**
**మెరుగైన సేవలు అందించేలా తహసీల్దార్ కార్యాలయాలు పనిచేయాలి**
**గంగాపురి వద్ద రూ. 2.55 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం**
**మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**





**మంథని ఆగస్టు 24( నినాదం):** ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని మండలం గంగాపురి వద్ద రూ. 2.55 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను, కమాన్‌పూర్ మండలంలో రూ. 75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయాన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు గంగాపురి లో ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా పరిసర ప్రాంతాలకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రైతులు, గృహ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్యుత్, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగిస్తూ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

**భూ భారతి ద్వారా భూ సమస్యలకు పరిష్కారం**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం భూ భారతి ద్వారా చర్యలు చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థలో ఏర్పడిన అనేక సమస్యల కారణంగా రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి, ప్రజలకు పారదర్శకంగా భూ సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భూ రీ–సర్వే కార్యక్రమాన్ని దశలవారీగా చేపడుతున్నామని, మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయాన వెల్లడించారు. భూ రికార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా అధికారులు సమగ్రంగా పనిచేయాలని సూచించారు.

**తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు సేవా కేంద్రంగా పనిచేయాలి**

కమాన్ పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు మెరుగైన సేవలు అందించే కేంద్రంగా పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవంగా స్వీకరించి, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ప్రజలు అందించే దరఖాస్తులు, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు అందుబా టులో ఉండే విధంగా అధికారులు పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, సమస్యలను క్షేత్రస్థాయి లోనే గుర్తించి పరిష్కరించే విధంగా అధికారులు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతాయని మంత్రి కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంధాలయ శాఖ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఆర్డీఓ సురేష్, తహసిల్దార్ వాసంతి, సంబంధిత ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపటోద్దు
### –కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులు విజ్ఞప్తి



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 24 (నినాదం)** వనపర్తి జిల్లా కేంద్రంలోని పానగల్ రోడ్డులో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి పార్క్ లో నిబంధనలకువిరుద్ధంగా ఇతర నిర్మాణాలు చేపట్టొద్దని 22వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణశ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో కలెక్టర్ ఆదర్శ్ సురభి కి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రక్కన (భగత్ సింగ్‌నగర్) వనపర్తి మొట్టమొదటి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్ రెడ్డి జ్ఞాపకార్థంవారి విగ్రహం ఏర్పాటు చేసి ఉన్నకొంత స్థలంలో పార్క్ ఏర్పాటు చేయడంజరిగిందని చెప్పారు. పార్క్ ఏర్పాటు కోసం నాటి మున్సిపల్ కౌన్సిల్30.09.2020 రోజు ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందని, ఈ పార్కు ముందు భాగంలోఆర్టీసీ బస్ సెల్టర్ కూడా ఉండడంతో ప్రయాణికులు సేద తీర్చడానికి వీలుగాఉండటంతో పాటు ప్రజలకు ఆహ్లాదభరితంగా ఉందని చెప్పారు. నియమ నిబంధనలు పక్కన పెట్టి అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులు సురవరంప్రతాప్ రెడ్డి పార్కులో ఇతర నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నాలుచేయడాన్ని వార్డు ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారుప్రజల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని సురవరం ప్రతాప్ రెడ్డి జ్ఞాపకార్థంఏర్పాటు చేసిన పార్కును వారి గౌరవార్థం యధావిధిగా కొనసాగించాలనివిజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు.


## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 24 (నినాదం) :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన సువర్ణ హత్య కేసులో దోషికి జీవిత ఖైదుతో పాటు రూ. 20,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. మహబూబ్ నగర్ జిల్లా, మహ్మదాబాద్ మండలం, వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొమ్మరి రాజు (29) రంగారెడ్డి జిల్లా, గండిపేట్ మండలం, పీరంచెరువు వెస్ట్ ఎండ్ కాలనీలో అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఇతను నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నంబర్ 1040/2021, ఐపీసీ సెక్షన్లు 302, 379, 404, 201 కింద నమోదైన హత్య కేసులో దోషిగా తేలాడు. విశాల్ మార్ట్‌లో హౌస్‌కీపింగ్‌గా పనిచేస్తున్న మేడింటి సువర్ణ 9 మే 2021న రాత్రి విధులకు వెళ్ళి తిరిగి ఇంటికి రాలేదు. కూతురు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది వెతికిన తల్లి మేడింటి మణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యల్లో భాగంగా సువర్ణ మృతదేహం విద్యుత్ వ్యాలీ లేఅవుట్ ప్రాంతంలో గాయాలతో, వస్తువులు పోగొట్టుకుని అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయగా అనేక కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు దొమ్మరి రాజుకు సువర్ణతో సన్నిహిత సంబంధం ఉన్నట్లు, ఘటన రోజు ఇద్దరూ కలిసి మోటార్ సైకిల్‌పై నేరస్థలానికి వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. సువర్ణతో జరిగిన గొడవ కారణంగా కోపోద్రిక్తుడైన నిందితుడు ఆమెను బలవంతంగా కొట్టి, గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో అంగీకరించాడు. హత్య అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారం, మొబైల్ ఫోన్‌ను దొంగిలించి, దర్యాప్తు నుంచి తప్పించుకునేందుకు సాక్ష్యాధారాలను ధ్వంసం చేశాడు. కాల్ డేటా రికార్డుల ద్వారా వారిద్దరి మధ్య సంభాషణలు, కీలక ప్రాంతాల్లో ఉనికి నిర్ధారణ అయ్యాయి. పోస్టుమార్టం నివేదికలో ఊపిరాడకుండా చేయడం, గొంతు నులమడం మరియు ఛాతీపై బలమైన గాయాల వల్లనే మరణం సంభవించినట్లు స్పష్టమైంది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, సమగ్ర దర్యాప్తు పూర్తి చేసిన అనంతరం కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో పూర్తి స్థాయి విచారణ చేపట్టిన రాజేంద్రనగర్‌లోని పదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నేరం రుజువు కావడంతో దోషికి జీవిత ఖైదు, రూ 20,000 జరిమానా ఖరారు చేసింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, వాదనలు వినిపించిన నార్సింగి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. శివ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. కృష్ణమూర్తిల కృషిని అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# కర్నేతండా ఎత్తిపోతల పథకం ప్రారంభం

### మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించిన ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి

**బిజినపల్లి, ఆగస్టు 24 నినాదం** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం లట్టుపల్లి, ఉమ్మడి మిట్యా తండా పరిధిలోని వనపర్తి జిల్లా కర్నేతండాలో ఎత్తిపోతల పథకాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డిలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం అందుబాటులోకి రావడంతో స్థానికంగా సాగునీటి సౌకర్యం మెరుగుపడి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సాగునీటి వసతి పెరగడంతో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని, కర్నేతండా పరిసర ప్రాంతాల



అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, ఆర్డీవో, తహసీల్దార్ ఎండీ మునీరుద్దీన్, అదనపు గిర్దావర్ బాలరాజు, సర్పంచులు ఇస్లావత్ పుల్యానాయక్, మునీంద్రర్ నాయక్, కృష్ణ నాయక్, మారేపల్లి చంద్రగౌడ్, జలం నాగయ్య, గోవింద్ నాయక్, ఎండీ నజీర్,




వాలే నాయక్, మాజీ సర్పంచులు అమృత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎంపీటీసీలు గడ్డం రామచంద్రయ్య, ఇస్లావత్ శ్రీశైలం, మల్లికార్జున్‌రెడ్డి, కటిక బాలరాజు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వర్షాల వేళ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండండి

### ఇంటి ముందు నీరు నిలవకుండా చేయండి  మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ


**వైరా ఆగస్టు 24( నినాదం):** ఖమ్మం జిల్లాలో వచ్చే వారం రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ రాష్ట్ర వాతావరణ శాఖ, ప్రజా ఆరోగ్య శాఖలు తెలిపాయని, వైరా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలందరూ అప్రమత్తతో ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతెలిపారు. వర్షాలతో దోమల బెడద పెరిగే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కిటికీలు, తలుపులకు దోమతెరలు ఏర్పాటుచేసుకోవాలి అని మలేరియా డెంగ్యూ, చికున్‌గున్యా నివారణకు ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించి నిల్వ నీటిని తొలగించాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి, ప్రజలకు చంద్రకళ సూచించారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించేందుకు కాచి చల్లార్చిన లేదా ఫిల్టర్ చేసిన నీటినే తాగాలని, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఆరోగ్యపరమైన సలహాలు సూచించారు. వైరల్ జ్వరాలు, ఇన్ఫ్లుయెంజా లక్షణాలు ఉంటే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని. అత్యవసర పరిస్థితుల్లో 108కు కాల్ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక పడకలు, ఐవీ ద్రవాలు, అవసరమైన మందులు సిద్ధంగా



ఉంచారని ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్లు సంగీత, పాండు

**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 24 ( నినాదం ):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కరించాలని




ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు అందాయి. వీటిలో కలెక్టరేట్‌లో 37, సంగారెడ్డి డివిజన్‌లో 13, జహీరాబాద్ డివిజన్‌లో 3, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 ఫిర్యాదులు, వినతులు అందాయి. అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదు. ప్రజావాణిలో అందిన వినతుల్లో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఈఈపీఆర్, మున్సిపల్, ఇంటర్మీడియట్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా శిశు సంక్షేమం, దివ్యాం గుల సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తు పరిష్కారానికి తీసుకున్న చర్యలను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi

మంగళవారం
25-8-2026

# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం




బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది. క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్రస్వరూపంతో అమ్మవారిని

# విడుదలకు ముందే టాక్సిస్ రికార్డులు

యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం




తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ.30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతు న్నాయి. అక్కడ ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ.1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది.



# రాకాలో ఐశ్వర్యలక్ష్మి నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737